పెరట్లో తులసి కోటముందు దీపం వెలిగిస్తున్న సత్యవతి, వీధిలోనించి, "సుందరమ్మా! ఓ సుందరమ్మా!" అన్న పిలుపు విని గబగబ వీధిలోకి వచ్చింది. పేరయ్యశాస్త్రి గుమ్మంలో నిల్చుని అరుస్తున్నాడు. గుమ్మందగ్గరకి వచ్చిన సత్యవతిని చూసి, కనుచీకట్లో కళ్ళు ఆనక, కళ్ళు చికిలించి చూస్తూ,

''ఎవరదీ? సత్యం! అమ్మవుందా?' అని అడిగాడు. సత్యవతి,

''రండి మామయ్యగారూ! అమ్మ పెరట్లో వుంది పిలుచుకొస్తాను'' అంటూ ఆయన్ని ఆహ్వానించి లోపలికి వెళ్ళింది. పేరయ్య వుస్సురని నిట్టూరుస్తూ అరుగు మీద చతికిలబడి, ముక్కు పొడుం డబ్బా తీశాడు. పెరట్లో పశువుల కొట్టం దగ్గర పని పిల్లాడి చేత పాలు పితికిస్తున్న సుందరమ్మ కూతురు వచ్చి పేరయ్యశాస్త్రి వచ్చాడని చెప్పగానే,

"రాముడూ! పాలతోబాటు లాంతరు యింట్లోకి తేవడం మరిచిపోకు! కర్రిగేదెకి తవుడులో డాక్టరు యిచ్చిన మందు పెట్టి తినిపించి మరీ వెళ్ళు!" అంటూ పనికుర్రవాడిని హెచ్చరించి, హడావిడిగా వీధివైపు నడిచింది. తల్లి వెనకే సత్యవతి కూడా యింట్లోకి వచ్చేసింది. పేరయ్యశాస్త్రి యెందుకు వచ్చాడో సత్యవతికి చూచాయగా తెలుసు. సుందరమ్మ చాలా రోజులబట్టి,

"మా సత్యానికో మంచి సంబంధం చూసి పెడుదూ! నీకు పుణ్యం వుంటుంది. మగదిక్కు లేని దాన్ని! నేను యెక్కడని వెతకగలను? దాన్నో యింటిదాన్ని చేసే బాధ్యత నీదన్నయ్యా!'' అంటూ పోరుతోంది. 'బహుశా యేదో సంబంధం గురించి వచ్చి వుంటాడు.' అనుకుంటూ వీధివైపు రాబోయిన సత్యవతి,

"....మా యింట్లో పాలు తాగవచ్చు! మరి ఫరవాలేదు. అమ్మాయ్! మామయ్యగారికి కాసిన్ని పాలు పంచదార వేసి తెచ్చిపెట్టు'' అంటూ తల్లి కేక వెయ్యగానే వెనక్కి తిరిగి వంటింటివైపు నడిచింది. దాలిలో నించి పాలు తీసి కంచుగ్లాసు లోకి వంచి పంచదార వేసి పట్టుకొస్తున్న సత్యవతికి,

"....ఆఁ! అదమ్మా సంగతి. కుర్రాడు బుద్ధిమంతుడు. ముందూ వెనకా యెవరూ లేరు. సర్కారీ నౌకరీ చేస్తున్నాడు. ఈడుజోడు గూడా ఫరవాలేదు. రెండో పెళ్ళి అన్నమాటే గాని, చిన్న వయసే!'' అంటున్న పేరయ్యశాస్త్రి మాటలు వినిపించి అడుగు ముందుకు పడలేదు. 'రెండో పెళ్ళి' అన్నమాట విని అంతదాకా వురకలు వేస్తున్న ఆమె మనసు బాధగా మూలిగింది. సత్యవతి పాలగ్లాసు పేరయ్యశాస్త్రి పక్కన పెట్టేసి, తలుపు చాటుకి వెళ్ళి నిల్చుంది. సుందరమ్మ రెండు


## జి. ఉషా విఠల్

క్షణాలు ఆలోచిస్తున్నట్టు వూరుకుని,

"రెండో పెళ్ళి అని నేను ఆలోచించడం లేదు. మొదటి భార్య చిన్న వయసులో పోతే మళ్ళీ పెళ్ళి చేసుకోవడంలో తప్పులేదు గూడాను. కాకపోతే అతగాడు భార్యని వదిలేశాడంటున్నారు మరి! అందుకే తటపటాయించవలసి వస్తోంది'' అంది. తల్లి మాటలు విన్న సత్యవతి గతుక్కుమంది. 'మొదటి భార్య బ్రతికి వుండగా మళ్ళీ పెళ్ళా? ఛీ! ఈ మొగాళ్ళకి సిగ్గులేదు. ఛస్తే యీ పెళ్ళికి వప్పుకోగూడదు' అనుకుంది. పేరయ్యశాస్త్రి గ్లాసుడు పాలు గటగటా తాగేసి, గ్లాసు కింద పెడుతూ,

"ఇదిగో సుందరమ్మా! నేను చెప్తున్నా విను! మనసులో యేవో సందేహాలు పెట్టుకుని నిక్షేపమంటి సంబంధం వదులుకోకు. కుర్రాడిని గురించి ఆఫీసులో వాకాబుచేశాను. ఎలాంటి దురలవాట్లు లేవు. అందరిదగ్గరా మంచి పేరు వుంది. అసలు చాలామందికి అతనికి అంతకుముందు పెళ్ళయినట్టే తెలీదు. కొద్దిమందికి తెలిసినా, భార్యాభర్తలు యెందుకు విడిపోయారో యెవరూ చెప్పలేకపోయారు. ఇరుగుపొరుగుని వాకాబు చేద్దామంటే అతను ప్రస్తుతం యేదో లాడ్జిలో గది తీసుకుని వుంటున్నాడు. ఆ లాడ్జిలో కూడా అతని గురించి యెవరూ చెడ్డగా చెప్పలేదు. అన్ని విషయాలూ నీకు విడమరిచి చెప్పాను. ఆలోచించుకుని నాకే సంగతీ రేపు కబురు పెట్టు. నువ్వే సంగతీ చెపితే, సత్యం ఫొటో పంపించి, పిల్లని చూసుకోడానికి రమ్మని రాయవచ్చు''అన్నాడు. సుందరమ్మ అతనికి

# దొరికిన పెళ్ళికొడుకు!



యేం సమాధానం చెప్పలేదు. పేరయ్యశాస్త్రి.

"మరి నేవస్తాను. చీకటిపడిపోయింది. ఈమధ్య బొత్తిగా కళ్ళు ఆనడం లేదు. సత్యం! వస్తానే!" అంటూ లోపలికి కేకపెట్టి లేచి నిల్చున్నాడు. సుందరమ్మ కూడా మర్యాదకి లేచి ఆయన వెనకే రెండడుగులు వేసింది.

ఆలోచిస్తూ లోపలికి వచ్చిన తల్లిని సత్యవతి పలకరించలేదు. తల్లి తనతో యేమైనా చెప్తుందేమోనని యెదురు చూసింది. కాని సుందరమ్మ పేరయ్యశాస్త్రి వచ్చిన విషయానికి ప్రాముఖ్యం యివ్వనట్టు మామూలుగా పనులు చూసుకోసాగింది. రాత్రి భోజనాల దగ్గర కూడా సుందరమ్మ కూతురితో పెళ్ళి సంబంధం గురించి చర్చించలేదు. పొడి పొడి మాటలతోనే భోజనాలు ముగించి తల్లీకూతుళ్ళిద్దరూ పక్కలు చేరారు. పేరయ్య తీసుకొచ్చిన సంబంధం గురించే ఆలోచిస్తూ పడుకున్న సుందరమ్మకి చాలా రాత్రిదాకా నిద్రపట్టలేదు. రెండో పెళ్ళి అయినా హైద్రాబాద్ సంబంధమే ఆమెకి కాస్త మెరుగు అనిపించింది. కాకపోతే మొదటి భార్యతో అతను యెందుకు తెగతెంపులు చేసుకున్నట్టో? ఆ పిల్లలో యేదో లోపం వుండి యితను వదిలేసి వుంటే తను బాధపడాల్సిందేమీ లేదు. కాని ఆ అమ్మాయే అతని ప్రవర్తన బాగుండకో, మరే లోపంవల్లనో అతన్ని వదిలేసి వుంటే? సుందరమ్మ ఆ ఆలోచనే భరించలేనట్టు అస్థిమితంగా పక్కమీద కదిలింది. అబ్బే! అలా జరిగి వుండదు. ఈ సమాజంలో ఆడది భర్తని తనంతట తను వదిలేసి తలెత్తుకు తిరగగలదా? మనుషులు తిరగనిస్తారా? అసలు అంత ధైర్యం యెలా వుంటుంది? అయినా పేరయ్య చెప్తున్నారుగా కుర్రాడు బుద్ధిమంతుడేనని! ఆస్తి, హంగులేని తను యింతకంటే మంచి సంబంధం చెయ్యగలదా? పేరయ్య చెప్పిన మరో సంబంధం మరీ నాసిరకంగా వుంది. కుర్రాడు వంటలు చేసుకుంటూ బ్రతుకుతున్నాడు. కనీసం స్కూలు చదువు గూడా ముగించలేదు. పైగా బాదరబందీలు యెక్కువ! సుందరమ్మ ఆ సంబంధం గురించి అట్టే ఆలోచించలేదు. కాని హైద్రాబాద్ సంబంధం గురించే ఆమె యెటూ తేల్చుకోలేకపోతోంది. ఆమెకి ఆలోచన చెప్పగలవాళ్ళు యెవరూ లేరు. సుందరమ్మకి హఠాత్తుగా యెన్నో యేళ్ళ క్రితం కన్ను మూసిన భర్త జ్ఞాపకానికి వచ్చాడు. మాయదారి మొగుడు ఛస్తూ ఛస్తూ యీ పిల్లనొకదాన్ని నా మెడకి కట్టి మరీ పోయాడు. అనుకుంది కసిగా.

సుందరమ్మ పెళ్ళినాటికి, ఆమె భర్త శేషయ్యకి

ఆ వూర్లో చెప్పుకోదగ్గ ఆస్తే వుండేది. అంత ఆస్తినీ తాగుడుకి, జూదాలకి హారతి కర్పూరంలా వెలిగించేసి, ఆరేళ్ళ సత్యవతిని మాత్రం సుందరమ్మకి మిగిల్చి కనుమూసేశాడు. ఆస్తినీ, భర్తనీ రెండిటినీ పోగొట్టుకుని రెక్కలు విరిగిన పక్షిలా పడిపోయిన సుందరమ్మని వూరివాళ్ళు ఆదుకుని సహాయం చేశారు. వాళ్ళ సహాయంతో పాల వ్యాపారం మొదలుపెట్టి, ఈనాటికి నాలుగు గేదెలతో పాటు, నాలుగు గదుల ఆ కొంపనీ మిగుల్చుకుని పిల్లని పెంచుకొచ్చింది సుందరమ్మ. పాలు పితికించి, దగ్గరలో వున్న పట్నానికి పంపి అమ్మిస్తూ వుంటుంది. సుందరమ్మ పాలవ్యాపారం పెద్దగా పెరిగినా పెరక్కపోయినా, సత్యవతి మాత్రం చకచకా యెదిగిపోయి తల్లి గుండెల మీద కుంపటై కూర్చుంది. సుందరమ్మకి మొదట్నించీ సత్యవతికి వూళ్ళో సంబంధాలు చెయ్యడం అంత యిష్టం లేదు. అక్కడి కుర్రాళ్ళకి ఆస్తులు అంతస్తులు తప్ప చదువు, సంస్కారాలు తక్కువ. పైగా ఎంత ఆస్తి వున్నా పేడపిసకడం, పిడకలు పట్టటం, పొయ్యి వూదుకోవడం తప్పవు. కూతురు కూపస్థ మండూకంలా ఆ వూర్లో వుండిపోవటం యిష్టం లేకే సుందరమ్మ పేరయ్యశాస్త్రి కాళ్ళు పట్టుకుంది. అర్థరాత్రి దాటినా సుందరమ్మ ఆలోచనలు తెగలేదు. హైద్రాబాదు సంబంధంలో ముందడుగు వెయ్యాలో మానాలో తేల్చుకో లేకపోయింది. పోనీ సత్యాన్ని అడిగితేనో? అనుకుంటూ, సత్యవతి యింకా పక్కమీద కదుల్తూ వుండటం చూసి,

“సత్యం” అని పిల్చింది. తల్లి పలకరింపు కోసమే యెదురు చూస్తున్న సత్యవతి చటుక్కున కళ్ళు తెరిచి,

“ఏవిటమ్మా?” అని అడిగింది. సంబంధం గురించి కూతురితో చర్చించడమా? మానడమా? అని క్షణం సేపు గుంజాటన పడి, ‘చిన్నపిల్ల! దానితో దాని పెళ్ళి గురించి మాట్లాడటమేమిటిలే!’ అనుకుని,

“ఏం లేదు, పడుకో!” అనేసింది. సత్యవతి నిరాశగా కళ్ళు మూసుకుంది.

రాత్రంతా బుర్ర బద్దలు కొట్టుకుని తెగ ఆలోచించి యెటూ తేల్చుకోలేని సుందరమ్మ తెల్లారి పేరయ్యశాస్త్రి వచ్చి,

“మరేం ఆలోచించావు? సుందరమ్మా!” అని అడగగానే,

“పిల్లను చూసుకోడానికి రమ్మని రాయండి అన్నయ్యా!” అనేసింది.

*

ప్రకాశ్ పెళ్ళి చూపులకి వచ్చేదాకా సత్యవతి తల్లిని యెదిరించాలని, రెండో పెళ్ళివాడిని, అందునా మొదటి భార్యని వదిలేసిన వాడిని తను చస్తే చేసుకోనని తెగేసి చెప్పాలని యెన్నోసార్లు అనుకుంది. కాని సుందరమ్మ యేనాడూ ఆమెకా అవకాశం యివ్వలేదు. తనకి యిష్టం లేకుండా పెళ్ళి చూపులు జరుగుతున్నందుకు సత్యవతికి వళ్ళు మండిపోయింది. మొహం గంటుపెట్టుకునే అతని ముందుకు వచ్చి కూర్చుంది. ప్రకాశ్‌తో మధ్యవర్తి పేరయ్యశాస్త్రి యేవో మాట్లాడుతున్నాడు.

“మా పిల్లని గురించి మేమే చెప్పుకోవడం బాగుండదు కాని, మా సత్యం రత్నం లాంటి పిల్ల అనుకోండి. అందుకే యీ వయసులో, నా పిల్లలు ‘యింక యీ పెళ్ళిళ్ళు కుదిర్చే పని మానేసి విశ్రాంతిగా యింటి పట్టున వుండు నాన్నా’ అని శతపోరుతున్నా, ‘సత్యం పెళ్ళి నా చేతుల మీదుగా కుదిర్చి మరీ మానేస్తానని చెప్పాను. ఈ వూళ్ళో పెద్ద చదువులు లేవు. ఏదో యిక్కడున్నంత వరకూ, యేడోక్లాసుదాకా చదువుకుంది. పల్లెటూరి పిల్లల పనిపాటా గురించి నేను వేరే చెప్పక్కర్లేదు. ముగ్గులెయ్యడం దగ్గర్నించీ, పదిమందికి వంటి వడ్డించగల నేర్పు వుంది....” అంటూ పేరయ్యశాస్త్రి మాట్లాడుతూ వుంటే ప్రకాశ్ చిరునవ్వుతో వింటూ కూర్చున్నాడు. అతనికి సత్యవతిని చూడగానే, వస్తూ వస్తూ వాళ్ళ వాకిట్లో చూసిన ముద్దబంతిపువ్వు జ్ఞాపకానికి వచ్చింది. అమ్మలక్కలెవరో,

“సత్యం! పెళ్ళికొడుకు బాగున్నాడే! తలెత్తి చూడు. అలా బుర్ర మోకాళ్ళల్లో పెట్టుకు కూర్చోకు” అనగానే చివ్వున తలెత్తి చూసిన సత్యవతి హృదయం వున్నట్టుండి పది పల్టీలు కొట్టింది. అతని చూపుల్లో చిక్కుకున్న తన కళ్ళని తిప్పుకో లేక పోయింది.

“చూడమంటే అలా గుడ్లప్పగించి చూస్తూ వుండిపోవడమేనా? ఇంక చాలు! పాపం అతనికి దృష్టి తగలగలదు.” అంటూ మళ్ళీ యెవరో హెచ్చరించడంతో గుక్కతిప్పుకుని కళ్ళు వాల్చేసింది. కాని అతని చూపులు, రూపం ఆమె హృదయంలో పీఠం వేసుకు కూర్చుని అంతదాకా ఆమె చేసుకున్న నిర్ణయాలన్నిటినీ గాలిలో కలిపేశాయి. సత్యవతి లోపలికి వెళ్ళాక సుందరమ్మ ధైర్యం చేసి,

“అబ్బాయితో పెద్దవాళ్ళెవరూ రాలేదు. అమ్మాయి నచ్చిందేమో కనుక్కుంటే, మరి మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చు.” అంది. ఆమె తరఫునా మాట్లాడగల మొగవాళ్ళెవరూ లేరు. ప్రకాశ్‌తో కూడా, అతనితోటి వుద్యోగి, స్నేహితుడు అయిన రంగనాధం వచ్చాడు. ప్రకాశ్ అతనితో ముందే చెప్పి వుంచాడు. పిల్ల నచ్చితే అతని తొడ మీద రెండుసార్లు తడతానని. వెంటనే కాలయాపన చెయ్యకుండా మిగతా విషయాలు మాట్లాడమని, పిల్ల నచ్చకపోతే ఒక్కసారి మాత్రం తడతానని యేదో వంకన బయలుదేరి వెళ్ళిపోవాలని! కాకపోతే రంగనాధం కూడా కుర్రాడే! పల్లెటూరి పెళ్ళి చూపుల గురించి అనుభవం లేనివాడు. అమ్మలక్కల చిరునవ్వులు, పేరయ్యగారి వాగుడు, సుందరమ్మగారు పెట్టిన పాలకోవా అతన్ని వుక్కిరిబిక్కిరి చేసేశాయి. ఆ హడావిడిలో ప్రకాశ్ తన తొడ మీద యెన్నిసార్లు తట్టాడో అతనికి జ్ఞాపకం రాలేదు. సుందరమ్మగారు అలా అనగానే అతను తెల్లమొహం వేసి, కంగారుగా ప్రకాశ్‌ని,

“ఒరేయ్! ఒకసారా? రెండుసార్లా?” అని అడిగాడు. ఆ మాటవిని పేరయ్యశాస్త్రి తెల్లమొహం వేశాడు. సుందరమ్మ అనుమానంగా చూసింది. ప్రకాశ్‌కి వళ్ళు మండింది. తనవైపు అనుమానంగా చూస్తున్న పేరయ్యశాస్త్రిని, సుందరమ్మనీ యిబ్బందిగా చూస్తూ, స్నేహితుడి తొడమీద బలంకొద్దీ రెండు చరుపులు చరిచాడు రంగనాధం.

“బాబోయ్! మీ అమ్మాయి మా వాడికి నచ్చింది.” అనేశాడు. గది గుమ్మాల్లో నుంచి తొంగిచూస్తున్న అమ్మలక్కలు కిలకిలా నవ్వేశారు. పేరయ్యశాస్త్రి తేరుకుని,

“మా సుందరమ్మకి వున్న ఆస్తి అల్లా పెరట్లో వున్న ఆ రెండుగేదెలు, ఈ కొంపా! ఇవి ఎలాగూ ఆమె తదనంతరం కూతురికే చెందుతాయి, మీరు కాదు కూడదు అంటే మరి అవే యెక్కడైనా తాకట్టు పెట్టి కట్నంగా యిచ్చుకుంటుంది. మీరేం ఆశిస్తున్నారో చెప్తే ఆవిడ తూగగలదో లేదో చూసుకుంటుంది.” అన్నాడు. సుందరమ్మ ఆతృతగా ప్రకాశ్‌వైపు చూసింది. ప్రకాశ్ స్నేహితుడి వైపు చూశాడు. అతను,

"మా వాడికి మీ అమ్మాయి నచ్చింది. మరి మీ అమ్మాయికి మా వాడు నచ్చాడో లేదో ముందు కనుక్కోండి. ఇకపోతే మావాడికి మీ ఆస్తిపాస్తుల మీదా, కట్న కానుకల మీదా ఆశలు లేవు. వాడి తరఫున కట్నాలు, లాంఛనాలు ఆశించే వాళ్ళు కూడా యెవరూ లేరు. వాళ్ళ అమ్మగారు పోయి నాలుగైదేళ్ళు అవుతోంది. ఇంటి భోజనం కోసం మొహం వాచిపోయి వున్న మా వాడు, యెప్పుడు పెళ్ళి చేసుకుని భార్యని తీసుకు పోయి వండించుకు తిందామా? అని ఆతృతగా వున్నాడు గనుక దగ్గర్లో ముహూర్తాలు వున్నాయేమో చూడండి!" అంటూ గుక్కతిప్పుకోకుండా చెప్పేసి, ప్రకాశ్,

"ఏమిటా వాగుడు?" అంటూ మళ్ళీ తొడమీద ఒకటిచ్చుకోగానే,

"బాబోయ్!" అంటూ ముగించాడు. ఈసారి వాళ్ళ ధోరణికి సుందరమ్మకీ నవ్వు ఆగలేదు. కాస్సేపట్లోనే సత్యవతికి పెళ్ళికొడుకు నచ్చినట్టు లోపల్నించి కబురు వచ్చింది. "శుభస్య శీఘ్రం" అంటూ పేరయ్య శాస్త్రి అప్పటికప్పుడే తాంబూలాలు పుచ్చుకునే యేర్పాటు చేసేశాడు. సుందరమ్మ,

"మా సత్యం పెళ్ళి అన్నవరం కొండమీద చేస్తానని యెప్పుడో మొక్కుకున్నాను బాబూ...." అంటూ ప్రకాశ్ వైపు చూసింది. ప్రకాశ్ చిరునవ్వుతో.

"నాకేం మొక్కులు లేవండీ! పెళ్ళి యెక్కడ, యెలా జరిపించినా నాకు అభ్యంతరం లేదు." అన్నాడు. సుందరమ్మ మనసు తేలికపడింది. ఆవిడ మనసులో యెక్కడో, అతని మొదటి పెళ్ళి గురించి అడిగితేనో? అన్న ప్రశ్న వుదయించినా, ఎలా అడగడం? ఏమని అడగడం? అడిగితే కోపం వచ్చి మాకీ సంబంధం వద్దు అనేసి పోతేనో? అన్న సందేహాలతో మాట్లాడకుండా వూరుకుంది. ప్రకాశ్‌ని చూశాక ఆవిడకి యేమైనా సరే యీ సంబంధం వదులుకోకూడదు అనిపించింది. అంతే కాకుండా పేరయ్య శాస్త్రి విన్నదెంతవరకూ నిజమో? కిట్టనివాళ్ళెవరైనా అతనికి పెళ్ళయిందనీ, మొదటి భార్యనించి విడిపోయాడనీ పుకారు పుట్టించారేమో! మనిషిని చూస్తే అసలు యింతకు ముందు పెళ్ళయినట్టు కనిపించదు. లేత వయసే! పైగా మెత్తని స్వభావం వున్న వ్యక్తిలా వున్నాడు. అనవసర సందేహాలతో అతని మనసు నొప్పించి, ఈ సంబంధం వదులుకోవడం వివేకమైన పని కాదు. అన్నిటికీ ఆ భగవంతుడే వున్నాడు అనుకుంటూ, ఆ భగవంతుడి మీద భారంవేసి ముహూర్తం పెట్టించేసింది. పెళ్ళిలో యెవరైనా బంధువులు వస్తే ఈ విషయాలు కదపవచ్చు ననుకున్న ఆవిడకి నిరాశే యెదురైంది. పెళ్ళికి అతనితో పనిచేసే వుద్యోగులు, స్నేహితులు తప్ప బంధువులనతగ్గ వారెవరూ రాలేదు. పెళ్ళి చాలా నిరాడంబరంగా, ప్రశాంతంగా అన్నవరంలో జరిగిపోయింది. అంత తేలిగ్గా యేపేచీలు, పూచీలు లేకుండా సత్యవతి పెళ్ళి అవుతుందని సుందరమ్మ యెప్పుడూ అనుకోలేదు. ప్రకాశ్‌ని చూసిన వాళ్ళందరూ,

"కుర్రాడు ముత్యంలా వున్నాడు. సత్యం అదృష్టవంతురాలు" అంటూ పొగడటంతో సుందరమ్మ వళ్ళు మరిచిపోయింది. ఆవిడకి కూతురి పెళ్ళి ఒక కలలాగ గడిచిపోయింది.

*

పెళ్ళి తంతు జరుగుతున్నంతసేపూ సత్యవతి యెంత మరిచిపోదామన్నా, 'అతనికి యీ అనుభవాలు కొత్తవి కావు.' అన్న ఆలోచన ఆమె మనసులో అలజడిని రేపింది. సత్యవతి చదువుకున్నది తక్కువైనా ఆమె చూసే సినిమాలు, చదివే పత్రికలూ ఆమెకి ఆలోచించగల శక్తినిచ్చేయి. అందుకనే ఆమె, సుందరమ్మ అంత తేలికగా మనసుకి సర్ది చెప్పుకోలేకపోయింది. మళ్ళీ, ప్రకాశ్ రూపం, మాట అన్నీ ఆమెని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. చిటికెనవేలు పట్టుకుని అగ్నిహోత్రం చుట్టూ తిరిగినప్పుడూ, ముందుకి వంగి తన మెడలో మాంగల్యధారణ చేస్తున్నప్పుడూ, గుడిలో దర్శనానికి వెళ్ళినప్పుడు ఆ రద్దీలో సున్నితంగా తన నడుంచుట్టూ అతను చెయ్యివేసినప్పుడూ ఆమె మనసు మధురరాగాలే పాడింది. కాని యెక్కడో ఆ రాగంలో ఆమెకి మాత్రమే వినిపిస్తున్న అపశృతి ఆమె మనసుని కల్లోలపరచసాగింది. వాడిన మొహంతో పరధ్యానంగా వున్న సత్యవతిని చూసి ప్రకాశ్, "పాపం! అలిసిపోయింది." అని అనుకున్నాడు.

శోభనం గదిలో అడుగుపెట్టబోయే ముందు సత్యవతి 'ఈ యేకాంతంలో అతన్ని అడిగేస్తాను.' అని అనుకుంది. కాని ప్రకాశ్ ముందుచెండలో నడిచివచ్చిన బాటసారి మంచినీళ్ళ గ్లాసు అందుకొన్నంత ఆత్రంగా తనని రెండు చేతులలోనూ బంధించగానే అంతా మరిచిపోయి అతని కౌగిలిలో కరిగిపోయింది. ఆ రాత్రి ప్రకాశ్ తన మొదటి పెళ్ళి విషయం తప్ప చాలా విషయాలు మాట్లాడేడు. హైద్రాబాద్ యెలా వుంటుందో వర్ణించి చెప్పేడు. తన జీతం, తన ఖర్చు, నాలుగేళ్ళ క్రితం పోయిన తన తల్లి గురించి, తన చదువు, చిన్నతనం చేష్టలు, యెన్నో మాట్లాడేడు. సత్యవతి అతను చాలా వుత్సాహంగా వుండటం గమనించి, యిప్పుడు ఆ విషయం అడిగి అతని మూడ్ చెడగొడితే కోపం వచ్చి సినిమాల్లో హీరోలాగ తలగడ పట్టుకుని బయటకి వెళ్ళిపోతాడేమోనని భయపడుతూ, అతని మాటలకి పరధ్యానంగా "ఊఁ!" కొట్టసాగింది. చాలా సేపటికిగాని ప్రకాశ్ సత్యవతి మౌనంగా వుండటాన్ని గమనించలేదు. గమనించగానే ఆమెని దగ్గరకి లాక్కుంటూ,

"ఏం? అలా వున్నావు? వంట్లో బాగులేదా?" అని అడిగేడు. అతను ప్రేమగా అడిగిన తీరుకి సత్యవతి కరిగిపోయింది. చిరునవ్వు నవ్వేసి,

"అబ్బే! ఏంలేదు. మీరు మాట్లాడుతున్నారుగా! వింటున్నాను." అంది, ప్రకాశ్ ఆ సమాధానంతో సంతృప్తిపడి మళ్ళీ తన ధోరణిలో పడిపోయాడు.

*

పెళ్ళి ముచ్చట్లన్నీ అవగానే ప్రకాశ్ తనకి శలవు లేదంటూ సత్యవతిని హైద్రాబాద్‌కి తీసుకు వచ్చేశాడు. సుందరమ్మ తనకి వున్నంతలో కూతురికి చీరె, సారె బాగానే పెట్టింది. కూతురితో పాటు ఆవిడ కూడా హైద్రాబాద్ రావాలనుకుంది గాని, వున్నట్టుండి గేదెకి జబ్బు చెయ్యడంతో యిల్లు కదలడానికి లేకపోయింది. ప్రకాశ్ తనకి పెళ్ళి నిశ్చయం అవగానే యిల్లు కుదుర్చుకుని, యింటికి కావలసిన సామాన్లు అదీ కొని వుంచడంచేత సత్యవతికి కొత్త కాపురం పెద్ద యిబ్బంది అనిపించలేదు. సత్యవతి ముందు పట్నంలో కాపురం అంటే భయపడింది. ప్రకృతి వొడిలాంటి పల్లెటూరిలో పెరిగిందేమో, సిటీలో యే యిరుకు కొంపలో వుండాల్సి వస్తుందోనని భయపడ్డ సత్యవతి, ప్రకాశం కుదిర్చిన యిల్లు చూసి చాలా సంతోషించింది. ఇల్లు వూరికి దూరంగా అప్పుడే డెవలప్ అవుతున్న కాలనీలో వుంది. రెండు గదులు, చిన్న హాలు, వంటిల్లు బాత్‌రూమ్ వగైరాలేకాక యింటి చుట్టూ కాస్తంత జాగా కూడా వుంది. వచ్చిన కొత్తలో ప్రకాశ్ సత్యవతికి హైద్రాబాద్ అంతా తిప్పి చూపించాడు, అత్త ఆడపడుచుల ఆరళ్ళుగాని, అంక్షలుగాని లేని కొత్త సంసారం. అనంతమైన భర్త ప్రేమ సాగరంలో

మునకలు వేస్తున్న సత్యవతికి కొన్ని రోజులు క్షణాల్లాగా గడిచిపోయాయి. సత్యవతికి పెళ్ళికాక ముందునించి వళ్ళువంచి పనిచెయ్యడం అలవాటు. పైగా పల్లెటూరి పనులు, పశువుల సంరక్షణలో ఆమెకి క్షణం తీరిక వుండేదికాదు. హైద్రాబాద్‌కి వచ్చాక, ప్రకాశ్ శలవు ముగిసి ఆఫీసుకి వెళ్ళడం ప్రారంభమయాక ఆమెకి పొద్దుపోవటం కష్టమైంది. ప్రకాశ్ ఆఫీసుకి వెళ్ళిన దగ్గర్నించీ, మళ్ళీ సాయంత్రం అతను తిరిగి వచ్చేదాకా ఆమెకి తీరికే! ఇంకా యిరుగు పొరుగు లెవరూ అట్టే పరిచయం కూడా అవలేదు. అందులోనూ సత్యవతిది కాస్త బిడియపడే స్వభావమేమో, చొరవ తీసుకుని యెవరితోనూ మాట్లాడేది కూడా కాదు. రోజంతా వూరికే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవడం యిష్టంలేక యింటిచుట్టూ స్థలం బాగుచేసి కూరగాయలు, పూల మొక్కల విత్తనాలు వేసింది. కలుపు తీస్తూ, గొప్పులు తవ్వుతూ, యిల్లు సర్దుకుంటూ, కొత్త రకం వంటలు చేసి చూస్తూ రోజంతా గడిపేసే సత్యవతికి హఠాత్తుగా యే రాత్రో మెలకువ వచ్చినప్పుడు, తనెన్నడూ చూడని సవతి జ్ఞాపకానికి వచ్చేది. ఆవిడ యెలా వుండేది? అసలు యెందుకు యిద్దరూ విడిపోయారు? ప్రకాశ్‌లో తనకే లోపమూ కనిపించడం లేదే! అతని ప్రేమ, మోహం, ఆవేశం తనని వుక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి. అతని సమక్షంలో లేని సమయం తనకెంతో దుర్భరంగా గడుస్తోంది. మరి ఆమెని కూడా భర్త యింతలా ప్రేమించాడా? ఇంతటి ఆనందాన్ని పంచి యిచ్చాడా? అలాంటప్పుడు, ఆమె యెలా యితన్ని వదిలి వెళ్ళిపోగలిగింది? ఒకవేళ యిదంతా పెళ్ళయిన కొత్తలో ప్రతీ భర్తా తన భార్యతో ప్రవర్తించే తీరా? ఈ వేడి చల్లారగానే ప్రకాశ్ తన నిజ స్వరూపం చూపిస్తాడా? అలా అనుకోడానికి ఆమె మనసు వప్పేదికాదు. పక్కన పడుక్కుని నిద్రపోతున్న ప్రకాశ్ మొహం అమాయకంగా, చిలిపిగా కనిపించేది. మళ్ళీ భయంవేసేది. ఇంతదాకా అతని కోపం యెలా వుంటుందో ఆమె చూడలేదు. కాని అతని ప్రేమలాగే అతని కోపం కూడా వుధృతంగా వుంటుందేమో. తను తట్టుకోలేనేమోననే అనుమానం ఆమె నోటికి తాళం వేసేది. భార్య మనసులోని అలజడిని తెలుసుకోలేని ప్రకాశ్ మాత్రం రోజులు వుత్సాహంగా గడిపేస్తున్నాడు.

*

చిన్న అట్లకాడతో, అప్పుడప్పుడే మొలకెత్తుతున్న పూలమొక్కల్లోని కలుపు తీస్తున్న సత్యవతి, వున్నట్టుండి వీధిలో పెద్ద అలజడి వినిపించగానే వులిక్కిపడింది. చేస్తున్న పని ఆపి శ్రద్ధగా వింది. పెద్దపెద్ద కేకలు, తిట్లు, యేడుపులూ కలగా పులగంగా వినిపిస్తున్నాయి. చేతిలోని అట్లకాడ అక్కడ పారేసి గేటు దగ్గరకి వచ్చి తొంగి చూసింది. వాళ్ళ యింటి యెదురుగా వున్న పెద్ద మైదానంలో అలగా జనం వేసుకున్న గుడిశలున్నాయి. వాళ్ళల్లో చాలామంది కట్టడం పనుల్లో కూలి చేస్తూ వుంటారు. కొందరు ఆడవాళ్ళు అక్కడి యిళ్ళల్లో పాచిపని కూడా చేస్తూవుంటారు. అప్పుడప్పుడు రాత్రిళ్ళు మొగుళ్ళు తాగేసి వచ్చి యింట్లో ఆడవాళ్ళని కొట్టడం లాంటివి చేసినప్పుడు ఏడుపులూ, కేకలూ సత్యవతీ వాళ్ళయింటి దాకా వినిపిస్తూనే వుంటాయి. కాకపోతే పగలు మాత్రం ఆ ప్రాంతమంతా నిశ్శబ్దంగా వుంటుంది. చిన్న పిల్లలు కూలికి వెళ్ళలేని ముసలాళ్ళు మాత్రం ఆ గుడిశల్లో వుంటూ వుంటారు. పట్టపగలు యీ గొడవేమిటా? అని ఆశ్చర్యపోతూ సత్యవతి కుతూహలంగా చూస్తూ గేటుదగ్గరే నిల్చుంది. చాలామంది ఒక గుడిశ ముందు గుంపుగా నిల్చుని యేదో అరుస్తున్నారు. మధ్య మధ్య ఆడవాళ్ళ యేడుపులు వినిపిస్తున్నాయి. చుట్టుపక్కల కొత్తగా కడుతున్న యిళ్ళల్లోని కూలీజనం కూడా అటువైపు పరిగెడుతున్నారు. సత్యవతికి విషయమేమిటో యెవరినైనా అడిగి తెలుసుకుంటే బాగుండుననిపించింది. కాని ఆ గుంపులోనించి బైటికి వచ్చేవాళ్ళెవరూ కనిపించలేదు. అందరూ అటే ఆకర్షింపబడి, ఆ వైపే పోతున్నారు. ఓ పదిహేను నిముషాలపాటు సాగిన ఆ గొడవ నెమ్మదిగా సర్దుకుంది. ఒక్కొక్కళ్ళే ఆ గుంపులోనించి బైటికి రాసాగారు. ఆడవాళ్ళ రాగాలు యింకా సాగుతూనే వున్నాయి గాని యిందాకటి స్థాయిలో మాత్రం కాదు. తనలో తనే నవ్వుకుంటూ వస్తున్న మేకల ముసలిదాన్ని,

"ఇదిగో అమ్మాయ్! ఇలారా! ఏమిటా గొడవ?" అంటూ సత్యవతిని కేకేసి పిలిచింది. ఆ ముసలిది రెండు మేకల్ని తెచ్చి సత్యవతి వాళ్ళ యింటి పక్కనున్న గుల్ మొహర్ చెట్టుకింద మేపుకుంటూ వుంటుంది. అది పొద్దున్నే వచ్చి, సాయంత్రం దాకా ఆ చెట్టు కిందే గడుపుతూ వుంటుంది. సత్యవతి కనిపిస్తేచాలు, కడుపు చూపించి,

"బువ్వెట్టమ్మా!" అని అడుగుతూ వుంటుంది. సత్యవతి యేదైనా మిగిలితే దాన్నే పిలిచి పెడుతూ వుంటుంది. తెలిసిన మనిషి గనకే సత్యవతి చనువుగా పిలిచింది. అది నవ్వుతూ దగ్గరకి వచ్చి,

"ఏం లేదమ్మా! సవతుల గొడవ. ఆ గుడిశలో వుండే పెంటయ్య మొదటి పెళ్ళాం రత్తి ఒక కోడెగాడి మాయలో పడి రెండేళ్ళ క్రితం మొగుడ్నొదిలి, ఆడెంబడి పోయింది. మొగోనికి పెండ్లాలే కరువా? నెల తిరక్కుండానే పెంటయ్య రంగిని మనువాడి తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఆడి మొదటి పెండ్లాము వచ్చి, 'నా యింట్లో నువ్వెవత్తివే?' అంటూ రంగిని జుట్టు పట్టుకుని గుడిశ బయటకు లాగి, తన్ని తను పోయి గుడిశలో కూర్చుంది. ఎవరు చెప్పినా వినదు. రంగి గోలుగోలున వొకటే యేడుపు." అంది. సత్యవతి ఆశ్చర్యంగా,

"మరి ఆ రత్తి వాడెవడితోనో పోయింది గదా? మళ్ళీ తన యిల్లు, తన మొగుడు అంటే వూరుకుంటారా?" అని అడిగింది. ముసల్ది పకపక నవ్వి,

"అదంటుందీ, రెండేళ్ళు నేను వేరే వాడితో వున్నంతకాలం, ఈ మొగోడు రంగితో కులకలేదా? దీనికి, దానికి చెల్లు గనక ఇప్పుడు రంగిని వదిలెయ్యమంటుంది." అంది. సత్యవతికి నవ్వు వచ్చింది.

"బాగుంది న్యాయం! ఇంతకీ ఆఖరికి యేమైంది?"

"ఏమౌతుందమ్మా! యిద్దర్నీ చెరో నాలుగు తన్ని, నోరు మూయించి, యిద్దర్నీ తనతోనే వుండమన్నాడు, నాసామిరంగా? ఇంక అడి పాట్లు చూడాలి." అని నవ్వుకుంటూ, ముసల్ది మేకలు దూరంగా పోవటం చూసి వాటిని మళ్ళించడానికి అటు పోయింది. సత్యవతి ఆలోచిస్తూ యింట్లోకి వచ్చేసింది. రంగి స్థానంలో తనున్నట్టు అనిపించింది. రేపొకవేళ యీయనగారి మొదటి భార్య గనక వచ్చి రత్తిలాగే గొడవ చేస్తే? ఛా అలగా వాళ్ళల్లాగా అలా గొడవ యెవరైనా చేస్తారా? అలగా వాళ్ళలాగ అరుచుకుని, తన్నుకుని గొడవ పడకపోవచ్చు. గొప్పవాళ్ళల్లాగే లోలోపల గొడవ పడితే? ప్రకాశ్ పెంటయ్యలాగ 'పోనీ యిద్దరూ నాతోనే వుండండి' అంటాడా? అలా అంటే తను వుంటుందా? వొప్పుకుంటుందా? ఛస్తే వుండదు. వుండక యేం చేస్తుంది? మొగుడ్ని వదిలి పల్లెటూరులో తల్లితో వుండే లోకులు బ్రతకనిస్తారా?

కాకుల్లా పొడిచెయ్యరూ? తప్పెవరిదైనా శిక్ష తను అనుభవించాలి. అలాగని మనసుని చంపుకుని ప్రకాశ్‌తో వుంటుందా? సత్యవతికి దుఃఖం ముంచుకొచ్చింది. మళ్ళీ వెంటనే తేరుకుంది. ఛా! ఇదేమిటి తనిలా ఆలోచిస్తోంది? ఆయన మొదటి భార్యకి విడాకులు యిచ్చేశారు గదా? మరి యే మొహం పెట్టుకుని వస్తుంది? అలా రావడానికి రత్తిలాంటి అలగా మనిషి కాదుగా! ఒకవేళ వస్తే ప్రకాశ్ మొహం బద్దలు కొట్టేటట్టు పొమ్మని చెప్పగలడా? చెప్పలేడు. ప్రకాశ్‌లో అంత కఠినత్వం తనకి యింకా కనిపించలేదు! మరేం చేస్తారు? ఆలోచనలతో సత్యవతి తల వగిలిపోవడం మొదలుపెట్టింది. లాభం లేదు. ఇలా ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోవడంలో అర్థం లేదు. ఎలాగైనా సరే ఆవిడని గురించి తెలుసుకు తీరాలి. ఎందుకు యిద్దరూ విడిపోయారో తెలిస్తే గాని తనకి మనశ్శాంతి వుండదు. కాని యెలా తెలుసుకోవడం. ప్రకాశ్‌కి దగ్గర బంధువులంటూ యెవరూ లేరు. దూరపు బంధువులున్నారో లేదో తెలియదు. స్నేహితులు, ఆఫీసు వాళ్ళూ మాత్రం ఇంటికి వస్తూ పోతూ వుంటారు. అవును. వాళ్ళని కదలేసి చూడాలి, కనీసం ఒకరు కాకపోతే ఒకరికైనా చూచాయగా తెలియకుండా వుంటుందా? అలా అనుకోగానే సత్యవతి మనసు శాంతించింది. అప్పట్నించి భర్తకి తెలియకుండా భర్త మొదటి వివాహ విషయం తెలుసుకోవాలని సత్యవతి చిన్న చిన్న ప్రయత్నాలు చెయ్యసాగింది.

*

వీధిలో నించి "సత్యా. సత్యా!" అన్న ప్రకాశ్ కేక, తలుపు తట్టిన చప్పుడూ వినిపించి. పెరట్లో పాదులకి గొప్పులు తవ్వుతున్న సత్యవతి, "అరె! ఇవాళ యింత తొందరగా వచ్చేశారేమిటి?" అని ఆశ్చర్యపోతూ పరిగెట్టుకుంటూ వచ్చి తలుపు తీసింది. ప్రకాశ్ హడావుడిగా లోపలికి వస్తూ,

"సత్యా! త్వరగా తయారవు. ఇవాళ మనింటికి చుట్టాలొస్తున్నారు. మనం స్టేషన్‌కి వెళ్ళాలి." అనగానే తెల్లబోయింది. అతను యేనాడూ యే చుట్టాల గురించి గాని, బంధువుల గురించి గాని ఆమెతో మాట్లాడ లేదు. ఆశ్చర్యంగా,

"చుట్టాలా? ఎవరు? ఎవరొస్తున్నారు? ఎంత మంది వస్తున్నారు?" అని అడుగుతున్న భార్యవైపు ప్రకాశ్ యెందుకో చిరాగ్గా చూశాడు. పెళ్ళయిన యిన్నాళ్ళల్లో సత్యవతి భర్త కళ్ళల్లో మొదటిసారిగా విసుగును చూసింది. సత్యవతి మొహం చిన్నబోవడం గమనించి,

"బైము లేదు సత్యా! ఎంతో మంది రావటం లేదు. ఒక్క మనిషే! వంట గురించి హైరాన పడకు. వచ్చేటప్పుడు హోటల్లో తినేసి వద్దాం." అన్నాడు మృదువుగా. సత్యవతి,

"హోటల్లో యెందుకు లెండి. మీరు మాట్లాడుతూ వుంటే, వంట చేసేస్తాను. ఇంతకీ వచ్చేదెవరో చెప్పారు కాదు." అంది.

"ఇప్పుడు చెప్పను. స్టేషన్‌కి వెళ్ళాక పరిచయం చేస్తానుగా." అన్నాడు వూరిస్తూ.

"సస్పెన్సు బాగానే వుంది." అంటూ తయారవడానికి లోపలికి వెళ్ళింది సత్యవతి.

*

ఇద్దరూ స్టేషన్‌కు చేరుకునే సరికి ట్రైన్ వచ్చేసిందేమో ప్లాట్‌ఫారం చాలా రద్దీగా వుంది. ప్రకాశ్ ప్లాట్‌ఫారం టిక్కట్లుకొని ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్లు ఆగేవైపు హడావిడిగా నడిచాడు దూరం నుంచే. పక్కన సూట్‌కేసులు పెట్టుకుని అటూ, ఇటూ చూస్తూ నిల్చున్న ఒక యువతి ప్రకాశ్‌ని చూసి.

"హేయ్ బావా!" అంటూ చెయ్యి వూపింది. అతను దగ్గరకు రాగానే.

"నా టెలిగ్రామ్ అందలేదేమోనని భయపడ్డాను. బొంబాయిలో దిగంగానే టెలిగ్రామ్ యిచ్చాను." అంది. ప్రకాశ్,

"సారీ లలితా వచ్చేసరికి ఆలస్యం అయిపోయింది. ఇబ్బంది పడలేదుగదా? అఁ! సత్యా! ఈవిడ మా మామయ్య కూతురు లలిత. మా ఆవిడ." అంటూ పరిచయం చేశాడు. సత్యవతి చేతులు జోడిస్తూ లలితను పరీక్షగా చూసింది. సన్నగా పొడుగ్గా బంగారు తీగలా వుంది. తన కంటే వయసులో కొంచెం పెద్దదనిపిస్తోంది. లలిత కూడా ముద్ద బంతిపువ్వులా అందంగా, ఆరోగ్యంగా వున్న సత్యవతిని యెగాదిగా చూస్తూ,

"మీ ఆవిడ చాలా బాగుంది బావా! సత్యా! సత్యా! అని పిలుస్తున్నావు కొంపదీసి మీ ఆవిడ పేరు సత్యభామ కాదుగదా?" అంది వేళాకోళంగా. ఆ మాట వినగానే ప్రకాశ్ కళ్ళల్లో క్షణం సేపు నీలి నీడలు అలముకోవడం, అతని మొహం సీరియస్‌గా మారడం సత్యవతి గమనించింది. 'ఓ! సత్యభామ కృష్ణుడి రెండో భార్యగదూ? ఆవిడకి తెలిసీ చురక అంటించిందన్నమాట.' అనుకుంది. ప్రకాశ్ క్షణంలో తేరుకుని,

"సత్యభామ కాదులే! సత్యవతి. వాళ్ళింట్లో అందరూ తనని సత్యం అని పిలుస్తారు. మొగాళ్ళ పేరులా వుందని నేను సత్యా అని పిలుస్తూ వుంటాను సరే గాని మీ ఆయన యెందుకురాలేదు? మీ పెళ్ళి తర్వాత ఆయన్ని కలవడమే పడలేదు. అన్నట్టు సత్యా! ఈవిడిప్పు డెక్కడ్నించి వస్తోందో తెలుసా? అమెరికా నుంచి. లలితా వాళ్ళాయన అక్కడే వుద్యోగం చేస్తున్నారు." అన్నాడు. లలిత నవ్వేస్తూ,

"బాగుంది నీ బడాయి. నేను అమెరికానించి వచ్చినా, అంతరిక్షంనించి వచ్చినా మామూలు మనిషినే! అవునూ? మీ ఆవిడ అంత మౌనంగా వుందేమిటి? మనిద్దరమే వాగుతున్నాం." అంది.

"నేనూ అదే అనుకుంటూ వుంటాను.ఎప్పుడూ నేనే మాట్లాడతానుగాని తను పెదవి కదపడమే అపురూపం. ముత్యం లాంటి తన ఒక్క మాట వినాలంటే నేను పదిమాటలు మాట్లాడాలి."అంటూ ప్రకాశ్ వేళాకోళం చెయ్యగానే సత్యవతి సిగ్గుపడిపోయి.

"ఛా! అలాగేంకాదు. నాకు మాట్లాడటంకంటే యెవరైనా మాట్లాడుతూ వుంటే వినడం యిష్టం." అంది. ప్రకాశ్ అటుగా వెళ్తున్న కూలివాడిని పిలిచి రెండు సూటుకేసులూ అందించి,

"మన కబుర్లన్నీ యిక్కడే ఖర్చయిపోతున్నాయి. ఇంటికి వెళ్ళి మాట్లాడుకోడానికి కాసిన్ని దాచుకుందాం." అంటూ స్టేషన్ బైటకి దారితీశాడు.

*

ఇంటికి వచ్చాక సత్యవతి త్వరత్వరగా కాఫీ కలిపి అందరికీ యిచ్చింది. ప్రకాశ్ భార్య వెనకే వంటింట్లోకి వచ్చి పంచదార డబ్బా అందించడం, గ్లాసులు తీసుకొచ్చి యివ్వడం లాంటివి చేస్తూ వుంటే లలిత వంటింటి గుమ్మం దగ్గర నిల్చుని,

"మీ ఆవిడ అందమైనదే కాదు. అదృష్టవంతురాలు కూడాను. నీలాంటి భర్త దొరకడం ఆవిడ చేసుకున్న పుణ్యం." అంది. ప్రకాశ్ యెందుకో లలిత మాటకి జవాబు చెప్పలేదుగాని సత్యవతి నవ్వేస్తూ,

"ఏదో మీరున్నారని సహాయం చేస్తున్నట్టు నటిస్తున్నారుగాని యెవరూ లేకపోతే వంటింటి

చాయలకి రాదు'' అంది. ప్రకాశ్ వెంటనే,

''అన్నీ అబద్ధాలు. అసలు తనే నన్ను యిక్కడ అడుగు పెట్టనివ్వడు.'' అన్నాడు. లలిత నవ్వుకుంటూ కాఫీ తాగేసి, బట్టలు తీసుకుని స్నానానికి బయలుదేరింది. సత్యవతి ప్రయాణం చేసి వచ్చిన అతిధికి త్వరగా వంటచేసి పెట్టాలనే వుద్దేశంతో వంట మొదలుపెట్టబోతూ కూరల బుట్ట తీసి చూసి,

''అయ్యో! కూరలు లేవండీ!'' అంది. ప్రకాశ్.

''అబ్బ! చంపేశావు. పప్పుపులుసు పెట్టి, వడియాలు వేయించేద్దూ!'' అన్నాడు కూరలు తేవడానికి బద్ధకిస్తూ. కాని సత్యవతి వూరుకోలేదు. 'బాగుండదు' అంటూ సంచీ చేతికి యిచ్చి ప్రకాశ్‌ని బజారుకి తరిమింది. అతను అలా వెళ్ళగానే లలిత స్నానం ముగించి జడ అల్లుకుంటూ వచ్చి వంటింటి గుమ్మంలో కూర్చుంది. సత్యవతికి లలితని చూసిన దగ్గర్నించీ, తన భర్త మొదటి భార్య గురించి చెప్పగల మనిషి యీవిడే అని అనిపించసాగింది. ఎంతయినా మామయ్యకూతురు. ఆవిడకి తెలియకుండా వుంటుందా? అనుకుంది. ఇప్పుడు అడగకపోతే మళ్ళీ యీవిడతో వంటరిగా మాట్లాడే ఛాన్సు వస్తుందో? రాదో? అనుకుంటూ, తన సంభాషణకి నాందిగా.

''మీరు అమెరికా వెళ్ళి చాలా సంవత్సరాలు అయిందా?'' అని అడిగింది. లలిత జడ అల్లుకోవడం ముగించి,

''చాలా సంవత్సరాలు అవలేదు. నాలుగైదేళ్ళు అయిందేమో! ఏం?'' అంది. సత్యవతి బియ్యం పప్పు కుక్కర్లో పెట్టి పొయ్యిమీదికి యెక్కించి, వుల్లిపాయలు ముందు పెట్టుకుని వలుస్తూ,

''మిమ్మల్నొక విషయం అడుగుతాను ఏం అనుకోరుగా?'' అంది. లలిత కుతూహలంగా చూస్తూ,

''ఏమిటి?'' అంది. సత్యవతి గుండెలు పీచు పీచుమంటున్నాయి. ఒకవక్క ప్రకాశ్ వచ్చేస్తాడేమోననే భయం. మరో పక్క లలిత యేమను కుంటుందోననే కంగారు. కొంచెం వణుకుతున్న కంఠంతో,

''మీ బావగారికి నేను రెండో భార్యననే విషయం మీకు తెలిసే వుంటుంది. ఆయన మొదటి భార్యా, ఈయన విడిపోయారని విన్నాము. కాని యెందుకు విడిపోయారో తెలియలేదు. మీరు దగ్గరి బంధువులుగదా? మీకు తెలిసివుంటుందని అడుగు తున్నాను.'' అంది. ఆ మాట విన్న లలిత కొన్ని క్షణాలు మాట్లాడలేదు. ఆవిడ మౌనం సత్యవతిలో భయం పుట్టించింది. అసలు ఈవిడ తన మాటలు వింధా? లేకపోతే యెలా చెప్పడం అని ఆలోచిస్తోందా? వుల్లిపాయలు వలవడంచేత కళ్ళల్లో వూరుతున్న నీటి పొరల్లో నించి లలిత వైపు చూసింది. లలిత,

''బావ మీతో యేం చెప్పలేదా?'' అని అడిగింది. సత్యవతి తల అడ్డంగా వూపుతూ 'లేదు' అంది.

''మరి మీవాళ్ళు యేం కనుక్కోకుండానే మిమ్మల్నిచ్చిచేశారా?'' అని అడిగింది లలిత మళ్ళీ. సత్యవతి నిట్టూర్చి.

''నాకు అమ్మ తప్ప మరెవరూ లేరు. ఆస్తి పాస్తులు, చదువు సంధ్యలు కూడా అంతంత మాత్రమే. వచ్చిన సంబంధాల్లో యిదే చాలా బాగుండటం చేత, వాకాబు చేస్తే నొచ్చుకుంటారేమోనని, ఆట్టే వివరాలు అడగకుండా పెళ్ళి జరిపించేశారు'' అంది. లలిత,

''పోనీ పెళ్ళయాక మీరే బావని అడగక పోయారా?'' అని అడిగింది. సత్యవతికి ఆవిడ ధోరణి నచ్చలేదు. చూస్తే యేదో దాచాలని సంభాషణ పొడిగిస్తున్నట్టుగా కనిపించింది. కొంచెం ముక్తసరిగా,

''నేను అడగలేదు. ఆయన తనంతట తను చెప్పలేదు. మీకు తెలిస్తే చెప్పమంటున్నాను'' అంది. లలిత నవ్వుతూ,

''మీకు కోపం వచ్చినట్టుంది. బావ ఎందుకు మీతో చెప్పలేదో....''లలిత మాట పూర్తయే లోపలే ప్రకాశ్,

''సత్యా! బెండకాయలు తెమ్మన్నావా? వంకాయలా? ఎందుకైనా మంచిదని రెండూ పట్టుకొచ్చేశాను'' అంటూ లోపలికి వచ్చేశాడు. సత్యవతి లలితకి వినిపించేటట్టుగానే నిట్టూరుస్తూ లేచి కూరల సంచీ అందుకుంది.

*

భోజనాలయ్యాక ప్రకాశ్ సత్యవతి వెనకే వంటింటి దగ్గర ఆమెకి యిల్లు సర్దడంలో చిన్న చిన్న సహాయాలు చేస్తూ వుండిపోయాడు. లలిత వెళ్ళి ముందు గదిలో కూర్చుంది. పని పూర్తి చేసుకుని ముందు గదిలోకి వచ్చిన సత్యవతితో లలిత,

''సత్యా! నాకు భోజనం చేశాక ఒక కప్పు కాఫీ తాగడం అలవాటు. ఏం అనుకోకుండా నాకో కప్పు కాఫీ చేసిపెట్టవూ?'' అని అడిగింది చనువుగా. భర్తనీ లలితని ముందు గదిలో వదిలి పెట్టి సత్యవతి వంటింటివేపు నడిచింది. డికాషన్ తీసి కాఫీ కలవడం బద్ధకం అనిపించి ఇన్‌స్టంట్ కాఫీ పాలల్లో వేసి రెండు నిముషాల్లో కాఫీ చేసి తీసుకుని బయలుదేరింది. సత్యవతి కాఫీ కప్పుతో గదిలో అడుగుపెడుతూవుండగా ప్రకాశ్ చాలా కోపంగా,

''నువ్వు ఆ విషయాలన్నీ జ్ఞాపకం చెయ్యడానికి వచ్చావని తెలిసివుంటే నువ్విచ్చిన టెలిగ్రామ్‌ని అప్పుడే చించి పారేసి వుండేవాడిని. అసలు స్టేషన్‌కి వచ్చివుండేవాడినేకాదు....'' అంటున్నాడు. సత్యవతిని చూడగానే అతని నోరు మూతపడిపోయింది. సత్యవతి, విసురుగా గదిలో నించి బయటికి వెళ్ళిపోతున్న భర్తని ఆశ్చర్యంగా చూసింది. లలితకి కాఫీకప్పు అందించి,

''నేను మిమ్మల్ని అడిగిన విషయం ఆయనతో చెప్పారా?'' అని అడిగింది భయంగా. లలిత మొహం పాలిపోయివుంది. లలిత ఆమె మాట విని నోటమాట రానట్టుగా తల అడ్డంగా వూపింది. లలిత చెప్పకపోతే ప్రకాశ్‌కి అంత కోపం ఎందుకు వచ్చిందో సత్యవతికి అర్థంకాలేదు. లలితని ఆ మాటే అడిగింది. ఆ లోపలే తేరుకున్న లలిత,

''నువ్వు అడిగావని చెప్పలేదు. 'సత్యతో నువ్వే సంగతులూ చెప్పలేదా?' అని అడిగానంతే! వెంటనే కోపం వచ్చేసింది. సత్యా! నాకు చాలా తలనొప్పిగా వుంది. నా పడక ఎక్కడో చూపిస్తే వెళ్ళి పడుకుంటాను'' అంది. సత్యవతికి అంత దాకా తేలిగ్గా వున్న వాతావరణం వున్నట్టుండి ఎందుకు గంభీరంగా మారిపోయిందో అర్థంకాలేదు. లలితకి పక్క అదీ సర్ది, తన పడకగది దగ్గరకి వచ్చిన సత్యవతి గుండెలు దడదడలాడాయి. లోపలికి అడుగు పెట్టడానికి భయం వేసింది. ఎలాగో ధైర్యం తెచ్చుకుని గది లోపలికి అడుగు పెట్టిన సత్యవతి ప్రకాశ్ నిద్రపోతూ వుండటం చూసి తేలిగ్గా నిట్టూర్చి, లైటార్పి వెళ్ళి అతని పక్కన పడుకుంది. అలిసిపోయివున్న ఆమె కళ్ళు నిముషాల మీద మూతలు పడిపోయాయి. ప్రకాశ్ అసలు నిద్రపోలేదని, రాత్రంతా ఆలోచిస్తూ కలత నిద్రలోనే గడిపాడనీ సత్యవతికి తెలియనే తెలియదు.

*

తెల్లారి కాఫీ తాగుతున్నప్పుడే లలిత తను ఆ

రోజు పదిగంటల ఫ్లైట్‌లో మెద్రాసు వెళ్ళిపోతున్నానని చెప్పగానే సత్యవతి ఆశ్చర్యపోయింది. ప్రకాశ్ వైపు చూసింది. ప్రకాశ్ అదేదో తనకి సంబంధం లేని విషయం అన్నట్టు మరోవైపుకి చూస్తూ కూర్చున్నాడు. సత్యవతికి భర్త ధోరణి అర్థం కాలేదు. లలిత కేవలం మొదటి పెళ్ళి విషయం జ్ఞాపకం చేసినందుకే అంత కోపం వచ్చిందా? ఆ మొదటి భార్య ఏదో క్షమించరాని తప్పు చేసి వుండాలి. లేకపోతే ఆమె జ్ఞాపకం రావడం కూడా అతనికి యిష్టం లేకపోవడం ఎందుకు? అనుకుంది. భర్త మొదటి భార్యని గురించిన ఆమె కుతూహలం రెట్టింపైంది. లలిత ప్రకాశ్ ధోరణికి చిన్నపుచ్చుకోవడం గమనించి సత్యవతి,

"అదేమిటి అప్పుడే వెళ్ళిపోవడం? రెండు రోజులుంటారనుకున్నను" అంది మర్యాదకోసం. ఆ మాట అనడానికి కూడా ప్రకాశ్ ఏమంటాడోనని భయపడింది. లలిత తల అడ్డంగా వూపుతూ,

"లేదు సత్యా! మిమ్మల్ని చూడాలనిపించి వచ్చానుగాని అసలు నేను తిన్నగా మెద్రాసు వెళ్ళాల్సింది. అక్కడ ఐ. ఐ. టిలో ప్రొఫెసర్‌గా నాకు పోస్టింగ్ వచ్చింది. రేపే జాయినవాలి" అంది దృఢంగా. సత్యవతి మరేం మాట్లాడలేదు. చేటిక్కిన అవకాశం జారిపోయిందేనని బాధపడింది. ఆ రోజు ప్రకాశ్ ఆఫీసుకి వెళ్ళిపోతే మళ్ళీ లలితను కదపాలనుకుంది. లలితని ఏర్‌పోర్టులో వదలడానికి ప్రకాశ్ వెళ్ళలేదు. సత్యవతి నెమ్మదిగా,

"బాగుండదేమో! మీరు కూడా వెళ్ళండి" అంది. ప్రకాశ్ నిర్లక్ష్యంగా,

"దేశాలన్నీ తిరిగి వచ్చిందిలే! భయమేంలేదు" అనేశాడు. లలిత యిల్లు వదిలి వెళ్ళాకే అతను ఆఫీసుకి వెళ్ళాడు. ఆ సంఘటనతో సత్యవతికి ఒక విషయం స్పష్టంగా అర్థం అయింది. భర్తకి, అతని మొదటి భార్య విషయంగాని, పెళ్ళి గురించిగాని, తను తెలుసుకోవడం ఎంతమాత్రం యిష్టం లేదన్నది! దానితో ఆమె పట్టుదల మరింత ఎక్కువైంది.

*

"పోస్టు" అన్న కేకతో పాటు తలుపు సందులోనించి జారి పడిన కవర్ని ఆత్రుతగా అందుకుని అటూ, యిటూ తిప్పి చూసింది. సత్యవతికి ఇంగ్లీషు బాగా రాదు. కలిపిరాత అసలు చదవలేదు. ఆ ఉత్తరం ఎవరి పేర్న వచ్చిందో ఆమెకి తెలియ్యలేదు. సుందరమ్మ ఎప్పుడు రాసినా కార్డు రాయిస్తుంది. ఆ కార్డులోనే తను గేదె పేడతో ఎన్ని పిడకలు తట్టిందో మొదలుకొని పూళ్ళో ఫలానావాళ్ళమ్మాయి పెళ్ళి నిశ్చయం అయిన సంగతి దాకా రాయిస్తుంది. ఆవిడకి పోస్టుకార్డులు తప్ప కవర్లు వున్నాయనే సంగతే తెలుసో తెలియదో సత్యవతికైతే తెలీదు. సత్యవతి కుతూహలం కొద్దీ చచ్చీ, చెడి కూడబలుక్కుని కవర్ మీద ప్రకాశ్ పేరు చదివింది. ఆమె చింపిచూద్దాం అనుకుంటూవుండగా, వంటింట్లోనించి పకోడీలు మాడిపోతున్న వాసన వెయ్యడం మొదలుపెట్టింది. పకోడీలు మూకుట్లో వేసిన సంగతే మరిచిపోయిన సత్యవతి,

"అయ్యయ్యో!" అనుకుంటూ ఆ ఉత్తరం అక్కడ పారేసి వంటింట్లోకి పరిగెట్టింది. సాయంత్రం టిఫెనుకోసమని పకోడీలు చేస్తోందామె! ఇంక, మాడిపోయిన ఆ పకోడీలు మూకుట్లోంచి తీసిపారేసి, నల్లగా మాడిపోయిన నూనెని వేరే గిన్నెలోకి వంచి మళ్ళీ కొత్త నూనె పెట్టి పకోడీలు వెయ్యడం మొదలుపెట్టిన సత్యవతి, సాయంత్రం ప్రకాశ్ వచ్చేదాకా ఆ ఉత్తరం సంగతే మరిచిపోయింది. ప్రకాశ్ ఆఫీసునించి వస్తూనే హాల్లో నేలమీద పడివున్న కవర్ని చేతికి అందుకుంటూ,

"ఏదో ఉత్తరం వచ్చినట్టుందే" అన్నాడు. భర్తకోసం కాఫీ, టిఫెను తెచ్చియిస్తున్న సత్యవతి ఆ ఉత్తరంవల్ల పకోడీలు ఎలా మాడిపోయాయో, వంటిల్లంతా పొగతో ఎలా నిండిపోయిందో వర్ణించసాగింది. భర్త ఆ ఉత్తరం చదువుతూ చాలా గంభీరంగా వుండిపోవడం, తన మాటలు శ్రద్ధగా వినకపోవడం గమనించగానే సత్యవతి,

"ఇంతకీ ఆ వుత్తరం ఎక్కడ్నించి వచ్చిందేమిటి? మీ పేర్న వుత్తరం రావటం యిదే మొదటిసారనుకుంటాను?" అంది. ప్రకాశ్ విసుగ్గా "నీకు సంబంధించినది కాదులే! వెళ్ళి స్నానానికి నీళ్ళు పెడుదూ!" అన్నాడు. భర్త అలా అనగానే సత్యవతి కళ్ళల్లో నీళ్ళు తిరిగినంత పనైంది. 'ఛా! ఎందుకడిగాను?' అనుకుంటూ భర్త స్నానానికి నీళ్ళు సిద్ధం చెయ్యడానికి వెళ్ళిపోయింది. భార్యనలా విసుక్కున్నందుకు ప్రకాశ్ కూడా బాధపడ్డాడు. లలిత రాసిన ఆ ఉత్తరాన్ని చింపి పారెయ్యాలనుకుంటూ వుండగానే,

"ఒరేయ్! బజారు కెళదాం అన్నావ్? ఇంకా కాఫీయే అవలేదా? అరె! టిఫెను పకోడీలా? ఏమైనా సత్యం వదిన బ్రహ్మాండంగా చేస్తుంది సుమా! ఏవీ యిలా రెండు పడెయ్యి!" అంటూ రంగనాధం తుఫానులా వచ్చిపడటం అదే సమయంలో సత్యవతి "నీళ్ళు పెట్టాను" అంటూ లోపల్నించి రావడంతో,

"సత్యా! వీడికో ప్లేటు పకోడీలు పట్రా! లేకపోతే నా ఖాళీ ప్లేటు తినేసేటట్టున్నాడు" అంటూ ఉత్తరాన్ని చింపే ప్రయత్నం విరమించుకుని స్నానానికి వెళ్ళిపోయాడు. ప్రకాశ్ స్నానం ముగించుకుని డ్రస్ చేసుకుని రాగానే స్నేహితులిద్దరూ బజారుకి బయలుదేరారు. ప్రకాశ్‌కి పెళ్ళి కాకముందు, ఇద్దరూ రోజూ సాయంత్రం వాకింగ్‌కి వెళ్ళి నోరు నొప్పెట్టినంతసేపు కబుర్లు చెప్పుకుని, హోటల్లో భోజనం చేసేసి లాడ్జికి చేరుకునేవారు. ప్రకాశ్‌కి పెళ్ళయాక వారానికి ఒక్క సాయంత్రం మాత్రమే రంగనాధంతో గడపడానికి ప్రకాశ్ ఒప్పుకున్నాడు. అది కూడా సత్యవతి అనుమతి మీదే! రంగనాధం ప్రకాశ్ ఎక్కడ మరిచిపోతాడోనని వారం, వారం ఆఫీసులోనే జ్ఞాపకం చేస్తూ వుంటాడు. "ఒరేయ్! ఇవాళ నా టర్న్‌రోయ్!" అని. ప్రకాశ్,

"నీక్కూడా పెళ్ళయితేగాని నాతో కబుర్లు చెప్పే ఈ రోగం నీకు కుదరదు" అంటూ వుంటాడు. స్నేహితులిద్దరూ అలా అటు వెళ్ళగానే సత్యవతి తలుపు వేసేసి, భర్త తననించి దాచిన ఉత్తరం వెతకటం మొదలుపెట్టింది.

*

"ఒరేయ్! నీకు నేను క్లోజ్ ఫ్రెండు నేనా?" అని సీరియస్‌గా అడిగిన రంగనాధంవైపు ప్రకాశ్ ఆశ్చర్యంగా చూసి,

"అవునూ! నీకెందుకా సందేహం వచ్చింది?" అని అడిగాడు. ఇద్దరూ బజారువైపు నడుస్తున్నారు. రంగనాధం,

"క్లోజ్ ఫ్రెండ్స్ మధ్య రహస్యాలు వుండకూడదని ఒప్పుకుంటావా?" అన్నాడు. మళ్ళీ ప్రకాశ్ నవ్వుతూ,

"ఒప్పుకుంటాను. నీకు తెలియని రహస్యాలేం లేవు" అన్నాడు. రంగనాధం ఆవేశంగా,

"అన్నీ అబద్ధాలు నీ జీవితంలోని ముఖ్యమైన

రహస్యమే నానించి దాచావు. నీకు సత్యం వదినతో రెండో పెళ్ళికదూ? మొదటి భార్యనించి విడాకులు తీసుకున్న సంగతి నాకెందుకు చెప్పలేదూ?" అంటూ నిలదీశాడు. ఆ మాట విన్న ప్రకాశ్ మొహం సీరియస్‌గా మారిపోయింది. అడుగు ముందుకు వేయ్యలేనట్లు అక్కడే ఆగిపోయాడు. గబుక్కున రంగనాధం చెయ్యి పట్టుకుని,

"నీకెవరు చెప్పారు?" అని అడిగాడు. అతని మొహంలోని భారం చూసిన రంగనాధం గొంతు పెగల్లేదు. ఎలాగో సర్దుకుని,

"ఇందాక మీ యింటికి వచ్చేసరికి నువ్వు స్నానానికి వెళ్ళావు. సత్యవతి వదిన కాఫీ, టిఫెను పట్టుకుని వచ్చి నాకిస్తూ, 'మీరు ఆయనకి క్లోజ్ ఫ్రెండ్‌గదా! అప్పుడు కూడా ఇలాగే వస్తూ, పోతూ వుండే వారేమో? ఆవిడా నాలాగే మీతో చనువుగా వుండేదా? ఆవిడ మంచిదేనా? ఎందుకు వాళ్ళిద్దరూ విడిపోయారు?" అని అడిగింది. మొదట వదిన అడుగుతున్న దేమిటో యెవరి గురించి అడుగుతుందో నాకు అర్థం కాలేదు. అదే ఆవిడతో చెప్పాను. నామాట నమ్మలేదు. మీ ఫ్రెండ్‌కి కోపం వస్తుందంటే నాతో చెప్పొద్దులెండి. ఏదో స్త్రీ సహజమైన కుతూహలం కొద్దీ అడిగాను అంది. నువ్వు మాట్లాడుతున్న దేమిటో నాకు అర్థం అయి చావడం లేదు తల్లీ మధ్యన నన్నెన్నులో పెట్టి చంపకు 'విషయమేమిటో వివరించమన్నాను. 'అంతా నాటకం! మీ ఫ్రెండ్‌కి నేను రెండో భార్యనని ఆయన మొదటి భార్యనించి విడాకులు పొందారనీ మీకు తెలియదా? ఏమిటి?' అంటూ బయట పెట్టింది. ఇంతలో నువ్వు స్నానం ముగించుకుని వచ్చావు. అప్పట్నించి నువ్వెందుకు నాకెప్పుడూ ఈ విషయం చెప్పలేదా అని బుర్ర బద్దలు కొట్టుకుని ఆలోచిస్తున్నాను." అన్నాడు. అంతా విన్నాక ప్రకాశ్ 'ఓ!' అంటూ రంగనాధం చెయ్యి వదిలేసాడు.

"అది పెద్ద రహస్యం కాదులే! ఎవరికీ తెలియకూడదన్న వుద్దేశమూ లేదు. కాకపోతే ఆ సంఘటనకి నా జీవితంలో అంత ప్రాముఖ్యత నివ్వలేదు. అందుకే యెప్పుడూ, యెవరిముందూ ఆ విషయం ప్రస్తావించలేదు. నీకు ఇంకోసారెప్పుడైనా ఆ వివరాలన్నీ చెప్తాలే!" అనేశాడు. వాడి పోయిన అతని మొహం చూసిన రంగనాధానికి ఆవిషయాన్ని మరి రెట్టించాలని అనిపించలేదు. ఇద్దరూ అలవాటుగా వెళ్ళే హోటలుకి వెళ్ళి కాఫీ తాగి, కాసేపు కబుర్లు చెప్పుకుని విడిపోయారు.

*

సత్యవతి వణుకుతున్న చేతులతో కవరులోని కాగితాన్ని బయటకి లాగింది.

"బావా!"

నేను చాలా దురదృష్ట వంతురాలిననే సంగతి ఆలస్యంగా తెలుసుకున్నాను. చదువులోనే సంస్కార ముంటుదను కుంటూ పప్పులో కాలేసాను. మాణిక్యాన్ని కాళ్ళ తన్నుకుని మట్టి బెడ్డ కోసం పరుగులు పెట్టాను. నీ మంచితనం నాకు తెలుసు. ఆ మంచితనాన్ని నా స్వార్థం కోసం నాయిష్టం వచ్చినట్లు వాడుకున్నాననే సంగతీ తెలుసు.

ఎన్నో ఆశలతో శేఖరాన్ని పెళ్ళి చేసుకున్న నేను ఒక్క రోజు కూడా సుఖపడలేదు. అంత చదువుకున్న మనిషి అంత సంస్కార హీనంగా ప్రవర్తిస్తాడనుకో లేదు. ప్రతిక్షణం, ప్రతినిముషం మన మొదటి రాత్రి గురించి, ఆ అనుభవాల గురించి గుచ్చి గుచ్చి అడిగి నన్ను మానసికంగా హింసించే వాడు. అమెరికా వెళ్ళేదాకా అతను శాడిస్టు అన్న సంగతి నాకు తెలియదు. ఆ శాడిజంలోనే నాలాంటి ఒకసారి పెళ్ళయిన స్త్రీని యెన్నుకున్నాడనే విషయం కూడా నాకు తరువాత అర్థం అయింది. ఆఖరికి నేనా హింస భరించ లేకపోయాను. ఆర్నెల్లు తిరక్కుండానే అతనితో తెగతెంపులు చేసుకున్నాను. నీకీ విషయాలన్నీ ఉత్తరం రాయాలనుకున్నాను. కాని, నాకే సిగ్గేసి ఉత్తరం రాయలేక పోయాను. సమక్షంలో అయితే నీ మనసుకి హత్తుకునేటట్లు చెప్పగల ననుకున్నాను. నేను అక్కడికి వెళ్ళింది కాంట్రాక్ట్ మీద అవడం చేత మధ్యలో కాంట్రాక్ట్ కేన్సిల్ చేసుకు రావడానికి కుదరలేదు. నేను చేసిన పొరపాటల్లా నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుంటావని ఊహించక పోవడమే! రైల్వే స్టేషన్‌లో సత్యని చూడగానే నాబావ్ని రెండోసారి శాశ్వతంగా పోగొట్టుకున్నానని అర్థం అయింది. ఆ రాత్రి నేనెంత పశ్చాత్తాప పడుతున్నానో విడమరచి చెప్పబోతే నీకు కోపం వచ్చేసింది. సత్య యెక్కడ మనని అపార్థం చేసుకుంటుందోనని భయపడి పోయావు. నన్ను తరిమేసినంత పని చేసావు. మిమ్మల్ని విడదియ్యాలన్నది నా ఉద్దేశం కాదు. చేజేతులా నేను చేసుకున్నది నేనే అనుభవించాలని నాకు తెలుసు. ఇప్పుడైనా ఈ ఉత్తరం యెందుకు రాస్తున్నానంటే నువ్వు నా మనసు తెలుసుకోవాలనే ఉద్దేశంతో...."

"సత్యవతి ఆ ఉత్తరాన్ని మరి చదవలేక పోయింది. ఆ ఉత్తరం యెవరు రాశారో ఆమెకి అర్థం అయిపోయింది. ఇంత కాలం తను వూహించుకుంటూ వచ్చిన మూర్తి లలితగా సాక్షాత్కరించడంతో ఆమె హృదయంలో జ్వరంలాంటి దేదో రేగినట్లయింది. దాంతో ఆమెకి ఆపుకోలేనంత దుఃఖం ముంచుకు వచ్చింది. అంత కాలం అస్పష్టంగా మనసులో మెదులుతున్న స్త్రీ లలితగా రూపం దాల్చడం ఆమె భరించలేక పోయింది. ప్రకాశ్ ప్రేమని జీవితాన్ని లలిత పంచుకుందనే నిజాన్ని ఆమె తట్టుకోలేక పోయింది. పెళ్ళయిన దగ్గర్నించి ప్రకాశ్‌తో తన సాన్నిహిత్యం, అతను చేసే చిలిపిచేష్టలు, జలపాతంలా వుక్కిరి బిక్కిరి చేసే అతని మోహం, ఆమెకి సినిమా రీళ్ళలా గిర్రున కళ్ళ ముందు తిరగసాగాయి. కాని వాటిలోని నాయిక తను కాదు. లలిత! ప్రకాశ్ కౌగిలిలో లలిత, ప్రకాశ్ వంగి ముద్దు పెట్టుకుంటున్నది లలితను! ఏమరుపాటుగా వున్నప్పుడు జడ పట్టుకుని వళ్ళోకి తూలిపడేటట్టుగా లాక్కునేది లలితని! సత్యవతి మనసు చిత్రవధని అనుభవించ సాగింది. ఎలా భరించ గలుగుతోంది యీ బాధని తను? ఇంతలా బాధపడాల్సి వుంటుందని తెలిస్తే, ఆయన మొదటి భార్య గురించి తెలుసుకునే ప్రయత్నమే తను చేసివుండేదికాదు. ఎవరో తెలియని స్త్రీ అనుకుంది. భర్త ప్రేమకి నోచుకోని దురదృష్ట వంతురాలనుకుంది. లలిత రాసిన ఉత్తరాన్ని బట్టి చూస్తే ప్రకాశ్ ఆమెని ప్రేమించాడనిపిస్తోంది. అందుకే మళ్ళీ పరుగెట్టుకు వచ్చింది అతని దగ్గరకు. ఆమె ప్రకాశ్ గురించి ఆలోచించటం లేదు. లలిత గురించీ ఆలోచించటం లేదు. కేవలం తన గురించి ఆలోచిస్తోంది.

*

ప్రకాశ్ బజారునించి తిరిగివచ్చేసరికి సత్యవతి వంటింట్లో రాత్రి వంటకి ప్రయత్నం చేస్తోంది. అతను ఆమెతో మాట్లాడలేదు. తిన్నగా తన గదిలోకి వెళ్ళిపోయాడు. వంట పూర్తయినా సత్యవతి వంటిల్లు వదలలేదు. అం గే అక్కడ మోకాళ్ళల్లో తలపెట్టుకు కూర్చుంది. ప్రకాశ్ వచ్చి,

"తెలియని వాళ్ళని నా మొదటి పెళ్ళి గురించి

అడిగితే వాళ్ళేం చెప్పగలరు? నన్నే సూటిగా అడగవలసింది.'' అన్నాడు గంభీరంగా. సత్యవతి చివ్వున తలెత్తి చూసింది. ప్రకాశ్ వంటింటి గుమ్మానికి రెండు చేతులూ ఆనించి అంత పొడుగూ నిల్చుని వున్నాడు. ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ప్రకాశ్ గబుక్కున ముందుకు వచ్చి రెండు చేతులూ చాచి ఆమెని లేవనెత్తి ఆర్తిగా హృదయానికి హత్తుకున్నాడు.

"ఏడవకు సత్యా! నువ్వు యేడవటం నాకు యిష్టంలేదు. కొన్ని విషయాలు నోటితో చెప్పడానికి బాగుండవు. ఎబ్బెట్టుగా వుంటాయి. నీనించి ఆ విషయాలు దాచాలని నేను అనుకోలేదు. మొదట్లో యెలా చెప్పాలో తెలియక వూరుకున్నాను. తర్వాత నీకెప్పుడూ ఆ విషయాలు చెప్పకపోవడమే మంచిదనుకున్నాను. అంతా వివరంగా రాసిపెట్టాను వెళ్ళి చదువుకో!'' ఆమెని గదిదాకా నడిపించుకువచ్చి టేబిల్ ముందున్న కుర్చీలో కూర్చోపెట్టి కాగితాలు చేతిలో పెట్టాడు. సత్యవతి కాగితాలని చేతిలోకి తీసుకుంటూ భర్త వైపు చూసింది. ప్రకాశ్ అలసిపోయినట్టుగా వెళ్ళి మంచంమీద పడుకున్నాడు.

"పెళ్ళినాటికి లలితకి పదిహేనేళ్ళు! నాకు పందొమ్మిది. లలిత స్కూలు ఫైనలు చదువుతోంది. నేను స్కూలు ఫైనల్లో ఒకసారి, ఇంటర్‌లో రెండుసార్లు డింకీలు కొట్టడంచేత అప్పుడే యింటర్ ముగించి టైపు, షార్టుహాండ్ నేర్చుకుంటున్నాను. మా పెళ్ళి మేము పుట్టినప్పుడే పెద్దవాళ్ళు నిశ్చయం చేసేయడంవల్ల పెళ్ళికి మా యిష్టాయిష్టా లెవరూ అడగలేదు. చిన్నప్పట్నించీ తెలిసిన లలిత మీద అయిష్టమూ లేదు, అలాగని ప్రత్యేకమైన యిష్టమూ లేదు. మా కుటుంబాలు చాలా చిన్నవి. మా అమ్మకి మామయ్య ఒక్కడే తోబుట్టువు. ఆయన ఒక్కగా నొక్క కూతురు లలిత! అలాగే అమ్మకి నేనొక్కడినే సంతానం. నేను పదేళ్ళ పిల్లాడిగా వున్నప్పుడే మా నాన్న కలరా వచ్చి పోయాడు. అలాగే లలిత చిన్నతనంలోనే మా అత్తయ్య పోయింది. మా పెళ్ళికి యిబ్బందులు వస్తాయేమోననే భయంతో మా అమ్మ లలితని చేరదీసి పెంచలేదు. పనివాళ్ళ సాయంతో మామయ్యే పెంచి పెద్దదాన్ని చేశాడు. అంటే మేమిద్దరం దూరదూరంగానే పెరిగాము. రెండు వైపులా గొప్ప ఆస్తిపరులంకాము. మామయ్య అదికాదు యిదనీ, యిదికాదు అదనీ రకరకాల వ్యాపారాలు చేస్తూ లాభాలు నష్టాలు భరిస్తూ రోజులు లాగించేస్తున్నాడు. మాకు కొద్దిగా ఫలసాయాన్నిచ్చే భూమి, స్వంతయిల్లూ వుండేది. వాటి ఆధారంతో మేము రోజులు గడుపుకువచ్చేవాళ్ళం. ఆర్థికపరంగా మా పెళ్ళికి యెలాంటి అవరోధాలు కలగలేదు. పెళ్ళినాటికి లలిత స్కూలు ఫైనలు చదువుతోందని చెప్పానుగా, తన పరీక్షల ముందు ముహూర్తం పెట్టారు. లలిత తను చదువుకోవాలి. ఈ వేడుకలన్నీ వద్దు అంటూ ఒకటే యేడుపు. పెద్దవాళ్ళ రంధి పెద్దవాళ్ళది. అప్పుడు తప్పితే మూఢమి వస్తోందని, మళ్ళీ చాలా రోజులదాకా ముహూర్తాలు లేవని పెద్దవాళ్ళ గొడవ! పెళ్ళి కేవలం పెద్దవాళ్ళ ముచ్చటకోసం జరిగింది. పెళ్ళిలో లలిత మూతి ముడుచుకునే కూర్చుంది. ఎవరైనా వేళాకోళం చెయ్యబోతే అరిచేది. టైము దొరికినప్పుడంతా పుస్తకం పట్టుకుని చదువుకుంటూ కూర్చునేది. లలిత ధోరణికి నాకూ పెళ్ళి జరుగుతోందన్న వుత్సాహం కలగలేదు. పెద్దవాళ్ళు చెప్పినట్టు ఆ తంతులన్నీ నిర్లిప్తంగా ముగించేను. లలిత ధోరణికి పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా ముక్కున వేలు వేసుకున్నారు. తాళి కట్టించుకోవడం తరువాయి. మరే వేడుకల్లోనూ లలిత పాలుపంచుకోలేదు. గదిలోకిపోయి తలుపు వేసుకు చదువుకుంటూ కూర్చుంది. మామయ్య అందరికీ సర్ది చెప్పాడు; అమ్మకి కూడా కోపం వచ్చింది. పెళ్ళి అనగానే నేను, అమ్మ మా వూరు వచ్చేశాము. ఏదో, యెవరింట్లోనో పెళ్ళికో, ఫంక్షన్‌కో వెళ్ళిన అనుభూతి తప్ప మాకు మరేం మిగలలేదు.

లలిత పరీక్షలు రాయగానే అమ్మ లలితని కాపరానికి పంపించెయ్యమని గొడవపెట్టింది. మామయ్య వప్పుకున్నాడు. లలిత వప్పుకోలేదు. తన రిజల్ట్సు వచ్చేదాకా పెళ్ళికి సంబంధించినయే విషయాలూ తనదగ్గర యెత్తినా, వురిపోసుకు ఛస్తానని బెదిరించింది. లలితకి చదువులో చాలా ఆసక్తి వుందనీ, చిన్నపిల్ల గనక అలా పట్టుబడుతోందనీ, రిజల్ట్సు రాగానే లలితని పంపించేస్తానని మామయ్య అమ్మకి వుత్తరం రాశాడు. వాళ్ళు ముగ్గురూ వాళ్ళ వాళ్ళ హక్కులకోసం, ఆరాటాలకోసం గుంజుమజ్జాలు పడుతూవుంటే నేను నిర్లిప్తంగా, నిమిత్తమాత్రంగా వుండిపోయాను. మామయ్యకు తెలిసిన స్నేహితుడి సహాయంతో నాకు వుద్యోగానికి ప్రయత్నం చెయ్యసాగాడు. నాకు యిప్పుడు పనిచేస్తున్న యీ ఆఫీసులోనే క్లర్కుగా వుద్యోగం రావడం, లలిత స్టేట్ సెకెండ్‌గా స్కూలు ఫైనల్ పాసవడం ఒకేసారి జరిగాయి. తను స్టేట్ ఫస్టు రాలేకపోయానని లలిత యేడుస్తోందని మామయ్య రాసినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. నాకు పాసవడమే గొప్పగా వుండేది. నేను, అమ్మ మా మకాం హైద్రాబాద్‌కి మార్చేశాము. ఇల్లు భూమి చూసుకునేవాళ్ళు లేరని వచ్చినకాడికి అమ్మేసి, డబ్బు బేంకులో వేసేసుకున్నాం. దానితో మాకు దూరపు చుట్టాలతో వున్న అంతంత మాత్రపు సంబంధం కూడా తెగిపోయింది. నాకు అమ్మ, అమ్మకి నేను అన్నట్టుగా వుండేవాళ్ళం. అమ్మ మళ్ళీ నాచేత లలితని కాపురానికి పంపించమని వుత్తరం రాయించింది. లలిత కాలేజీలో చేరతానని పట్టుబడుతోందని, తన చదువుకి స్కాలర్ షిప్ కూడా వస్తుందని, లలిత విషయంలో తనే నిర్ణయమూ చేసుకోలేకపోతున్నాననీ, మామయ్య జవాబు రాశాడు. అమ్మ లలితకి యీ చదువు రంధి యేమిటో అనుకుంటూ, లలితని యిక్కడ కాలేజీలో చేర్పిస్తామని, లలితని తీసుకువచ్చి దిగవిడిచి పొమ్మనీ నాచేత జవాబు రాయించింది. ప్రతీసారి లలిత మొండికేస్తూ వుండటం, నేను వుత్తరాలు రాస్తూ వుండటం నాకేమిటో చిన్నతనంగా, బాధగా వుండేది. అమ్మ మనసు నొప్పించలేక అమ్మ చెప్పినట్టు రాస్తూ వుండేవాడిని. ఎలా వప్పించాడో తెలీదు, ఆఖరికి మామయ్య లలితని వెంటపెట్టుకుని హైద్రాబాద్ వచ్చేశాడు. అమ్మ సమస్యలన్నీ తీరిపోయినట్టు సంతోషించింది.

"మా మొదటి రాత్రి చాలా తమాషాగా గడిచింది. లలితకి తను చేరబోయే కాలేజీ, తన పుస్తకాలు, తను తీసుకోబోయే సబ్జక్ట్సు తప్ప మరిదేనిమీదా ధ్యానం లేదు. రోజూ అమ్మతోపాటు పడుక్కునే లలిత ఆరోజు,

"అత్తయ్య నన్నిక్కడ పడుక్కోమంది.'' అంటూ నా గదిలోకి వచ్చింది. నాకూ చిన్నతనమే! అయినా అమ్మ లలితని అక్కడికి యెందుకు పంపించిందో, సింగిల్‌కాట్ వుండే నా గదిలో డబుల్‌కాట్ యెందుకు వుందో, బల్లమీద పాలు, పళ్ళు, సువాసనలు వెదజల్లుతున్న పూదొత్తులు యెందుకు వున్నాయో, అర్థంచేసుకోలేనంత చిన్నతనం మాత్రం కాదు. లలిత వస్తూనే యేదో పుస్తకం పట్టుకుని మంచంమీద కూర్చుంది.

లలిత, పుస్తకం చేతిలో వుంటే ప్రపంచాన్నే మరిచిపోతుందని తెలుసు. నేను తలుపు గడియ పెట్టి, దడదడలాడుతున్న గుండెలతో లలిత దగ్గరికి వెళ్ళి తన చేతుల్లోనించి పుస్తకం తీసేశాను. నాకు లలిత మీద ప్రత్యేకమైన ప్రేమలేదు. లలిత తనని ప్రేమించే అవకాశం నాకెప్పుడూ యివ్వలేదు. అప్పుడు, ఆ వయసులో సహజంగా వుండేకోరిక మాత్రం వుంది. నేను పుస్తకం తీసుకోగానే నావైపు చిరాగ్గా చూసింది.

“ఏమిటి బావా? సగం సగం చదువుతూ వుంటే పుస్తకం లాక్కున్నావు?” అంది విసుగ్గా. అప్పుడు ఆమె మొహంలో కనిపించిన విసుగు, చిరాకు నా వుత్సాహాన్ని నీళ్ళు కార్చేశాయి. లలితకి తను, ఇవాళ యిక్కడకి యెందుకు వచ్చిందో తెలీదా? చిన్నతనంవల్ల అర్థంకావడంలేదా? పదిహేను, పదహారేళ్ళ ఆడపిల్లల మనస్తత్వం యెలా వుంటుంది? ఇలాంటి వాటిమీద దృష్టి వుండదా? అన్నీ ప్రశ్నలే! నాకు ఆడపిల్లలతో పరిచయాలు లేవు. ఇంట్లో కూడా అక్కచెల్లెళ్ళెవరూ లేరు. లలితతో యెలా ప్రవర్తించాలో నాకు అర్థంకాలేదు. సంకోచంగా తన దగ్గరికి జరిగి, తన చుట్టూ చేతులు వేసి దగ్గరకి లాక్కోబోతూ,

“లలితా! ఇవాళ మన తొలిరాత్రి....” అన్నాను. లలిత సున్నితంగా నా చేతుల్ని తప్పించింది. దూరంగా జరిగింది. ఆమె ప్రవర్తనకి నేను దెబ్బతిన్నట్టు చూశాను. లలిత తలవంచుకుని గోరింటాకుతో పండిన తన అరచేతుల్ని చూసుకుంటూ,

“బావా నీకెలా చెప్పాలో తెలీటంలేదు. నాకివన్నీ యిప్పుడు యిష్టంలేదు” అంది. నేను దెబ్బతిన్నట్టు చూశాను. ‘లలితకి నేనంటే యిష్టం లేదా?’ అనుకుంటూ,

“లలితా నేనంటే నీకు యిష్టంలేదా?” అని అడిగాను. లలిత,

“నువ్వంటే నాకు యిష్టంలేదని చెప్పలేను. ప్రస్తుతం నాకు చదువుకోవాలని వుంది” అంది. నేను ఒరాగ్గా,

“చదువుకీ సంసారానికి సంబంధంలేదు. పగలంతా మనం యిలా గదిలో కూర్చోము. నువ్వు కాలేజీకి వెళతావు. నేను వుద్యోగానికి వెళతాను.” అన్నాను. లలిత కొద్దిగా మొహం ముడుచుకుని,

“నా కిష్టం లేదు. చదువు అనేది నా వుద్దేశంలో తపస్సు లాంటిది. దానికి కాన్సంట్రేషన్ అవసరం. సంసారం, పిల్లలూ యిప్పుడు నాకు వద్దు. ప్రస్తుతం నన్ను వదిలెయ్యి! నా మనసుకి నచ్చిననాడు నా అంతట నేనే నన్ను నీకు అర్పించుకుంటాను” అంది దృఢంగా. నేను హతాశుడనైపోయాను. లలితని బలవంతం చెయ్యాలనిపించలేదు. పెద్దవాళ్ళ కోసం యిద్దరం నటించడం మొదలుపెట్టాము. ముఖ్యంగా అమ్మకి యీ విషయాలన్నీ తెలియడం నాకు యిష్టంలేదు.

“లలిత నాపక్క మంచంమీదే పడుక్కుని హాయిగా చదువుకున్నంతసేపు చదువుకుని నిశ్చింతగా నిద్రపోయేది. ఎటొచ్చీ నాకే నిద్రపట్టేది కాదు. లలిత కాలేజీలో చేరిన ఆర్నెల్లకి మామయ్య గుండెపోటుతో పోయాడు. లలిత ఒక్క పడక విషయంలో తప్ప మిగతా విషయాల్లో నాతో చనువుగానే వుండేది. నేను తన భర్తని అన్నట్టే ప్రవర్తించేది. ఎప్పుడైనా శలవు రోజుల్లో మనసుకి నచ్చినప్పుడు నాతో సినిమాకి వచ్చేది. కాని యెప్పుడూ తన చిటికెనవేలు కూడా ముట్టుకోనిచ్చేది కాదు. నేను చనువు తీసుకోబోతే, “ప్లీజ్, బావా!” అని కళ్ళతోనే జాలిగా అర్థించేది. ఆ చూపు చూస్తే నా గుండెలమీద అయిసు ముక్క పెట్టిన భావన కలిగి నేను ముడుచుకుపోయేవాడిని. నా మనస్తత్వాన్ని, మెత్తదనాన్ని తను యెలా వాడుకోవాలో అలా వాడుకుంది. మా అమ్మకి మా యిద్దరి గురించీ అనుమానమే రాలేదు. ఇంటర్ కూడా డిస్టింక్షన్‌లో పాసయిన లలిత ఐ. ఐ. టి ఎంట్రెన్స్ పరీక్షకి ప్రిపేర్ అవసాగింది. నాకు మొదట్నించీ చదువు అబ్బలేదు. తను చదివే పుస్తకాలు, ఆ పరీక్షలూ నాకు అర్థం అయేవి కావు. లలిత మనసు మారడం కోసం వేచి చూడటమే నా పని! ఐ. ఐ. టి ఎంట్రెన్స్ పరీక్ష రాయడానికి తనని మెడ్రాసు తీసుకెళ్ళమంది. తీసుకువెళ్ళాను. అమ్మ, మేమూ యేదో విహార యాత్రకి వెళ్ళామనుకుంది. లలితకి ఐ. ఐ. టి లో సీటు వచ్చింది. అమ్మకి యీ విషయాలేమీ తెలియవు. లలిత మెడ్రాసులో హాస్టల్‌లో వుండి బి టెక్ చదువుతుందని చెప్పినప్పుడు మళ్ళీ యింట్లో పెద్ద దుమారం రేగింది. అమ్మ కోపానికి పట్టపగ్గాలు లేకపోయాయి. సంసారాన్ని కూడా వదులుకొని వెళ్ళి చదివి తీరాల్సిన చదువులేమిటని? అమ్మ నిలేసింది. లలిత అమ్మ కోపాన్ని లెక్క చెయ్యలేదు. నా అనుమతి కోసం అడగలేదు. లలితకి మామయ్య యిచ్చిన కొద్దిపాటి నగదు నగలు వున్నాయి. చాలా సామాన్యంగా, యే గొడవ జరగనట్టే వెళ్ళి ఐ. ఐ. టి లో చేరిపోయింది. నాకు లలితమీద చాలాసార్లు విరక్తిలాంటిది కలిగింది. కాని లలిత అలా పై చదువులకి వెళ్ళిపోయినప్పుడు పూర్తిగా విరక్తి చెందిపోయాను. మామయ్య నామీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చెయ్యడం యిష్టంలేక, లలిత చిన్నతనంవల్ల అలా ప్రవర్తిస్తోందనీ, కొంచెం మనసు యెదిగితే అన్నీ సర్దుకుంటాయనీ, అనుకుని నేను లలిత యోగక్షేమాలు తెలుసుకోవడం, అప్పుడప్పుడు మెడ్రాస్ వెళ్ళి లలితని చూసి వస్తూ వుండటం చెయ్యసాగేను. అమ్మకి నామీద కూడా కోపం వచ్చింది. నేను నా భార్యని అదుపులో పెట్టుకోలేని వాజమ్మని అన్నట్టుగా మాట్లాడేది. లలిత డిగ్రీ పూర్తయితే యీ గొడవలన్నీ సర్దుకుంటాయని అమ్మని సమాధానపరుస్తూ వుండేవాడిని. లలిత శలవులకి యిష్టమైతే హైద్రాబాద్ వచ్చేది. లేకపోతే హాస్టల్‌లోనే వుండి లైబ్రరీ పుస్తకాలతో కాలం గడిపేసేది. లలిత యెలా ప్రవర్తించినా తన కేరెక్టర్ విషయంలో వేలెత్తి చూపించేట్టుగా యెప్పుడూ ప్రవర్తించలేదు. బి. టెక్ మూడవ సంవత్సరంలో వుండగా అనుకుంటాను, లలితని చూడ్డానికి నేను ఒకసారి మద్రాసు వెళ్ళినప్పుడు శేఖరాన్ని తన క్లాస్‌మేట్ అంటూ నాకు పరిచయం చేసింది. లలిత చనువుగా నాకు మొట్టమొదటిసారిగా పరిచయం చేసిన వ్యక్తి శేఖరం! అప్పటికి నాకు లలిత మీద యెలాంటి అనుభూతి మిగల్లేదు. శేఖరాన్ని పరిచయం చేసినప్పుడు నా మనసులో యెలాంటి అనుమానం, అలజడి కలగలేదు. మరో ఆర్నెల్ల తర్వాత శలవలకి వచ్చినప్పుడు లలిత నేను కట్టిన మాంగల్యాన్ని తీసి నా చేతిలో పెడుతూ—

“బావా! నాకు విడాకులు యిచ్చెయ్య కూడదూ?” అంది చాలా మామూలుగా. ‘నాకో చీర కొనిపెట్టు’ అన్నంత తేలికగ్గా! ఆ మాట విని నేను అదిరిపోయాను. అమ్మ బ్రతికి వుండగా నేను విడాకులకి వప్పుకోనని చెప్పాను. లలితకి కోపం వచ్చింది,

“నేను అప్లై చేస్తాను. ఇద్దరం ఏ గొడవలూ లేకుండా విడిపోదాం. నువ్వు ఒప్పుకోకపోయినా, పెళ్ళయినా ఇంకా నేను కన్యగానే వున్నాననే విషయం నేను నిరూపించుకుని చాలా సులభంగా

విడాకులు పొందగలను'' అంది. నాకు పిచ్చికోపం వచ్చింది. ఆ రాత్రి మొదటిసారిగా లలితని బలవంతం చెయ్యబోయాను. కోరికతో కాదు. కోపంతో! లలిత నా చేతుల్లో ఓడిపోయే రకం కాదు. నా మత్తు వదిలేటట్టు చెంప అదరగొట్టి,

''అడుగు ముందుకు వేశావంటే మర్యాద దక్కదు. జాగ్రత్త'' అంది. నా మీద నాకే అసహ్యం వేసింది. ఫలితంగా యిద్దరం కోర్టు ద్వారా విడిపోయాం. అమ్మ గుండెలు పగిలిపోయాయి. మంచం పట్టి ఏడాది తిరక్కుండానే మామయ్యని చేరుకుంది. లలితతో అంత చిన్న వయసులో నా పెళ్లి, తుపానులాంటి ఆ జీవితం, కొన్నాళ్ళపాటు నాకు మనశ్శాంతిని కరువు చేశాయి. లలిత శేఖరాన్ని పెళ్లి చేసుకుని అమెరికా వెళ్ళిపోయింది. పెళ్లికి ఆహ్వానం పంపించింది. జరిగినవన్నీ మరచిపొమ్మనీ, నన్ను బాధించాలన్నది తన వుద్దేశం కాదనీ, పెద్దవాళ్ళు చేసిన బొమ్మలపెళ్లిలాంటి పెళ్లిలో తను ఒక బొమ్మగా మిగిలిపోలేకపోయానని, శేఖరం తన జీవితంలోకి రాకపోయినట్టయితే చదువు పూర్తి చేసుకుని నా భార్యగానే జీవితాన్ని గడిపేసి వుండేదాన్ననీ అంటూ యేమిటేమిటో వుత్తరం రాసింది. ఆ వుత్తరం నాలో యేలాంటి సంచలనాన్ని కలిగించలేదు. కొన్నాళ్ళ బ్రహ్మచర్యం తర్వాత నాకూ పెళ్లి చేసుకోవాలనిపించింది. లలిత కోసం జీవితాన్ని త్యాగంచేసి, ఆజన్మాంతం బ్రహ్మచారిగా వుండిపోవడంలాంటి పిచ్చిపనులు నేను చెయ్యదలచుకోలేదు. నాలో తనకోసం అంతటి స్పందనని లలిత మిగల్చను కూడా లేదు. ఫలితంగా మన పెళ్లి! నేను జీవితంలోని అపశృతులను మరిచిపోవడానికే ప్రయత్నిస్తాను. అందుకే లలితతో నా పెళ్లి, విడాకులు, ఆ జీవితం గురించి నేనెవరికీ చెప్పలేదు. లలిత మళ్లీ హఠాత్తుగా ప్రత్యక్షమై వుండకపోతే, ఆ వుత్తరం రాసి వుండకపోతే నేనెప్పటికీ యీ విషయాలు నీతో చెప్పేవాడిని కాదేమో! లలిత తను అమెరికా నించి బొంబాయిలో దిగినట్టూ, ఫలానా ట్రెయిన్‌లో వస్తున్నట్టు టెలిగ్రామ్ యిచ్చినప్పుడు నేను తనని మనింటికి ఆహ్వానించడమా? వద్దా? అని చాలా ఆలోచించాను. లలిత యిప్పుడు నా భార్య కాదు. మరో వ్యక్తి భార్య. నా మామయ్య కూతురు. తన మనసుకి నచ్చిన విధంగా నడుచుకున్నంత మాత్రాన తనని నేను వెలివేయడం అనవసరం అనిపించింది. తను అలా ప్రవర్తించబట్టే, నువ్వు నా జీవితంలోకి రాగలిగావు అనుకున్నాను. లలితకీ, నేను, నాకు లలిత తప్ప అమ్మ తరఫు బంధువులంటూ ఎవరూ లేరు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయి యిన్నేళ్ళయి పోయిన తర్వాత, ఆ విషయాలన్నీ మనసులో పెట్టుకోవడం ఎందుకనే ఉద్దేశంతో లలితని మనింటికి ఆహ్వానించాను. కాని లలిత, 'అప్పుడు తాను పొరపాటు చేశాను, యిప్పుడు నా మంచి తనం అర్థం అయింది'అంటూ మొదలు పెట్టడంతో నాకు లలిత మీద అసహ్యం వేసింది. అందుకే ఆ రాత్రి లలిత మీద కోపగించుకున్నాను. నీ మనసు పాడుచేస్తుందేమోనని భయపడ్డాను. అందుకే త్వరగా మనింటినించి సాగనంపాను. సత్యా, లలిత యేనాడూ నా మనసులో నువ్వు పొందిన స్థానాన్ని పొందలేదు. అర్థ రాత్రిలో నన్ను నిద్రలేపు, నానోటి నుంచి నీకొక్కటే మాట వినపడుతుంది. ''డార్లింగ్! ఐ లవ్ యు!'' అని, అంటే అర్థం తెలుసా? ప్రియతమా! నిన్ను (నిన్నే సుమా!) ప్రేమిస్తున్నాను.''

చదవడం పూర్తి చేసిన సత్యవతి చెంపలు ఎరుపెక్కాయి. కాగితాలు అక్కడ పడేసి నెమ్మదిగా మంచం మీద నిద్రపోతున్న భర్త మొహం మీదకి నిశ్శబ్దంగా వంగింది. ప్రకాశ్ చటుక్కున ఆమెని తన మీదకి లాక్కుని ఆమె చెవిలో ''డార్లింగ్! ఐ లవ్ యు!'' అన్నాడు. □



''అవతలి మనిషి మాట్లాడిన చిన్నమాటే ఒక్కొక్కసారి మనలో ఆలోచనలని రేకెత్తించవచ్చు! ఆ ఆలోచనలకో రూపం యిస్తే అదే కథగా మారుతుంది. అలాగే ఒకసారి నాకు కేవలం ముఖ పరిచయం మాత్రం వున్న భార్య, భర్తలు ఏవో కారణాలవల్ల విడిపోవడం జరిగింది. ఆ సంఘటన పరిచయస్తులలో కొద్దిగా సంచలనాన్ని రేకెత్తించింది. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ భర్త మరో స్త్రీని వివాహం చేసుకోవడం, తెలిసినవాళ్ళు మొదటి భార్య గురించి ''అయ్యో! పాపం!'' అంటూ జాలి పడటం జరిగింది. అందరూ వదిలేసిన మొదటి భార్య గురించి ఆలోచిస్తే నాలోని రచయిత్రి ఆ వ్యక్తిని చేసుకున్న రెండో భార్య పరిస్థితి గురించి ఆలోచించసాగింది. 'ఆ అమ్మాయి పరిస్థితిలో నేను వుంటే నాకెలా వుంటుంది?' అన్న నా ఆలోచనల ప్రతిబింబమే 'డార్లింగ్ ఐ లవ్ యూ!'. కాకపోతే నా కథలోని పాత్రలకీ, నాకు కొద్దిగా పరిచయం వున్న వ్యక్తుల సమస్యలకి ఎలాంటి సంబంధం లేదు. కథ, అందులోని పాత్రలు పూర్తిగా నా వూహ!

పి. ఉషారాణి.



Edited & Published by B. Viswanatha Reddi for DOLTON PUBLICATIONS, MADRAS-600 026
& Printed by B. V. REDDI at Prasad Process Private Ltd., Madras-600 026